RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక


www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 129 ఆదివారం, జూన్ 23, 2024 పేజీలు : 4

## వైఎస్ఆర్‌సిపి కేంద్ర కార్యాలయాన్ని కూల్చివేసిన సిఆర్‌డిఎ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతి రాజధానిలో తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్ఆర్‌సిపి కేంద్ర కార్యాలయాన్ని సిఆర్‌డిఎ అధికారులు కూల్చివేశారు. శనివారం ఉదయం 5.30 గంటల నుంచి భారీ పోలీస్ బందోబస్తు మధ్య బుల్డోజర్లు, పొక్లెయినర్లతో కూల్చివేత పనులను అధికారులు మొదలుపెట్టారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు తాడేపల్లిలోని 2 ఎకరాల్లో పార్టీ కార్యాలయం నిర్మాణం చేపట్టింది. ఆ నిర్మాణం అక్రమమంటూ గతంలో సిఆర్‌డిఎ అభ్యంతరం వ్యక్తం చేయగా వైఎస్ఆర్‌సిపి హైకోర్టును ఆశ్రయించింది.

## ఇది కదా దేవుడు రాసిన స్క్రిప్ట్ : చంద్రబాబు



అమరావతి: ఆనాడు 23 సీట్లు వస్తే దేవుడు రాసిన స్క్రిప్ట్ అని హేళన చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తు చేశారు. ఇవాళ కూటమికి 164 సీట్లు వచ్చాయని, ఇది దేవుడు రాసిన స్క్రిప్ట్ అని రీకౌంటర్ ఇచ్చారు. రెండో రోజు ఎపి శాసన సభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. 16వ శాసనసభ స్పీకర్‌గా చింతకాయల అయ్యన్నపాత్రుడిని ఎంఎల్ఎలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు శాసన సభలో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అసెంబ్లీ గేటు కూడా తాకనీయమని విమర్శించారని, ఇవాళ 21 సీట్లలో పోటీ చేసి అన్ని స్థానాలలో గెలిపించిన వ్యక్తి పవన్ అని ప్రశంసించారు. ఎక్కడ తగ్గాలో.. ఎక్కడ గెలవాలో తెలిసిన వ్యక్తి పవన్ అని కొనియాడారు. వైనాట్ 175 అని చెప్పి 11 తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. తన జీవితంలో ఎప్పుడూ చూడని సభ 15వ శాసన సభ అని, 15వ శాసన సభను కౌరవ సభగా మనం భావించామని చంద్రబాబు ధ్వజమెత్తారు.

## బసవతారకం ఆస్పత్రి లక్షలాది మందికి సేవలందిస్తోంది: రేవంత్



హైదరాబాద్: బసవతారకం ఆస్పత్రి లక్షలాది మందికి సేవలందిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. బసవతారకం ఆస్పత్రిని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దారని కొనియాడారు. పేదలకు సేవలందించాలని 1988లో ఆలోచన వచ్చిందని, నిస్వార్థంగా పేదలకు సేవలందించేందుకు ఆస్పత్రిని నిర్మించారన్నారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి 24వ వార్షికోత్సవం కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ, ఎపి టిడిపి ఎంఎల్ఎ బాలకృష్ణ, ఎంపి భరత్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. శంషాబాద్ లో హెల్త్ టూరిజం హబ్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నాన్నారు. ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో అభివృద్ధిలో పోటీపడే అవకాశం తనకు వచ్చిందని, చంద్రబాబు 18 గంటలు పని చేసి తాను 12 గంటల పని చేస్తే సరిపోదని, రాష్ట్ర నేతలు, అధికారులు కూడా 18 గంటలు పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు. అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలు పోటీపడడంతో పాటు ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలన్నారు.

## ఎపి శాసన సభ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు



అమరావతి: 16వ శాసనసభ స్పీకర్‌గా చింతకాయల అయ్యన్నపాత్రుడిని ఎంఎల్ఎలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయ్యన్న పేరును ప్రొటెం స్పీకర్ బుచ్చయ్య చౌదరి ప్రకటించారు. నూతన స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు బాధ్యతలు స్వీకరించారు. సభాపతి స్థానానికి అయ్యన్నను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్‌లు తీసుకెళ్లారు. విశాఖపట్నం జిల్లా నర్సీపట్నంలో 1957లో జన్మించాడు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కాకినాడలోని పిఆర్ కాలేజీలో బిఎ చదువుకున్నాడు .1983లో తొలి సారి ఎంఎల్ఎగా గెలిచారు. ఏడు సార్లు ఎంఎల్ఎగా గెలిచి మూడు సార్లు సాంకేతిక విద్యాశాఖ, రహదారుల భవనాల శాఖ, అటవీ శాఖ మంత్రిగా సేవలందించారు.

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను పరామర్శించిన సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యాన్ని పరామర్శించారు. రెండు రోజుల కిందటే ఎమ్మెల్యే భార్య రూపాదేవి ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి ఆయనను, కుటుంబ సభ్యులను ఓదార్చారు.
ఎమ్మెల్యే భార్య ఆత్మహత్యకు కారణాలు, అసలేం జరిగిందో మేడిపల్లి సత్యంను అడిగి వివరాలు తెలుసుకున్నారు రేవంత్ రెడ్డి.



## ఆపన్నులకు అండగా పవన్ కల్యాణ్ రోడ్డుపైనే జనసేనాని 'ప్రజాదర్బార్'

మంగళగిరి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ రోజు మధ్యాహ్నం అసెంబ్లీ నుంచి తిరిగి మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన సందర్భంలో వివిధ ప్రాంతాల నుంచి తమ బాధలు చెప్పుకొనేందుకు వచ్చిన వారిని చూశారు. వెంటనే కాన్వాయి ఆపి ఆఫీస్ ముందు కుర్చీలు వేసుకొని బాధితులతో మాట్లాడి అర్జీలు తీసుకున్నారు. కొన్ని అర్జీలకి సంబంధించి అప్పటికప్పుడు అధికారులతో ఫోన్లో మాట్లాడారు.

## అయోధ్య పూజారి లక్ష్మీకాంత్ దీక్షిత్ మృతి



వారణాసి: అయోధ్య రామాలయంలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట చేసిన పూజారి ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ నేడు కన్నుమూశారు. ఆయన వయస్సు 86 ఏళ్లు. అనారోగ్య కారణంగా ఆయన చనిపోయారని కుటుంబ సభ్యులు వెల్లడించారు. వారణాసిలోని గంగా నది తీరంలోని మణికర్ణిక ఘాట్ లో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. వారణాసి పండితుల్లో లక్ష్మీకాంత్ దీక్షిత్ అగ్రగణ్యులు. వారా స్వస్థలం మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా. కానీ వారి కుటుంబం ఎన్నో తరాలుగా వారణాసిలో స్థిరపడింది. ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యా నాథ్ ఆయన మృతిపట్ల స్పందించారు. తన ఎక్స్ పోస్ట్ లో సంతాపం వ్యక్తం చేశారు.

## చిన్న వ్యాపారులకు మేలు చేసేందుకే... ఆ మూడు సేవలపై... జీఎస్టీ తగ్గింపు



న్యూఢిల్లీ: చిన్న వ్యాపారులకు మేలు చేసేలా జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు తీసుకున్నదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. త్వరలో బడ్జెట్ పార్లమెంట్ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగింది. జీఎస్టీపై ట్రిబునళ్లు, కోర్టుకు వెళ్లే ట్రాన్సాక్షన్ పరిమితి పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు సమావేశం తర్వాత నిర్మలా సీతారామన్ మీడియాకు చెప్పారు. అలాగే వ్యాపారులు జరిమానా చెల్లించడంలో ఆలస్యమైతే, దానిపైన వడ్డీ కూడా చెల్లించాల్సి ఉందని, దీన్ని ఎత్తేయాలని జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నుంచి ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ఇన్ పుట్ క్రెడిట్ టాక్స్ విషయంలో మార్పులు చేయాలని నిర్ణయించినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు.
ప్రత్యేకించి, ఇన్ పుట్ క్రెడిట్ టాక్స్ విషయంలో మోసాలు జరుగకుండా ఆధార్ అథంటికేషన్ తప్పనిసరి అమలు చేయాలని నిర్ణయించాం అని తెలిపారు. అన్ని రకాల కార్టన్ బాక్సులపై జీఎస్టీ 12 శాతానికి కుదించడం ద్వారా ఆపిల్, ఇతర పండ్ల వ్యాపారులకు మేలు జరుగుతుందన్నారు.

## నీట్ లీకేజీలో మరో... ఐదుగురు అరెస్టు




న్యూఢిల్లీ: నీట్ యుజి ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో మరో ఐదుగురు వ్యక్తులను బీహార్ పోలీసుకు చెందిన ఆర్థిక నేరాల విభాగం అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. దీంతో ఇప్పటి వరకు ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 18కి పెరిగింది. తాజా అరెస్టులు జార్ఖండ్‌లోని దేవ్‌ఘర్‌లో జరిగినట్లు ఒక పోలీసు అధికారి తెలిపారు. నిందితులు ఐదుగురిని ప్రశ్నించేందుకు పాట్నాకు తరలించినట్లు ఆ అధికారి తెలిపారు. ఇదివరకు రాంచిలో అవదేష్ కుమార్, ఆయన కుమారుడు, నీట్ అభ్యర్థి అభిషేక్‌ను అరెస్టు చేశారు.
నీట్ ప్రశ్నాపత్రం కోసం ఈ కేసులో ప్రధాన సూత్రధారి సికందర్ యాదవేందుకు రూ. 40 లక్షలు చెల్లించినట్లు అవదేష్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో వెల్లడించారు. జార్ఖండ్‌లోని నిర్మాణ పరిశ్రమలో పనిచేయడం ద్వారా సికందర్‌కు, అవదేష్‌కు పరిచయాలు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఒకప్పుడు కాంట్రాక్టర్ పనిచేసి ప్రస్తుతం బీహార్‌లోని దానాపూర్ మున్సిపల్ కౌన్సిల్‌లో జూనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సికందర్ జార్ఖండ్‌లో పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది.
రాంచిలో సికందర్ కుమారుడికి ఇన్ఫినిటీ పేరిట ఒక పెద్ద స్పోర్ట్ స్టోర్ ఉండడంతోపాటు నగరంలోని బరియాతు ప్రాంతంలో ఒక విశబూలమైన బంగళా ఉంది. సికందర్‌పై ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు ఒక కేసును నమోదు చేసేందుకు ఆర్థిక నేరాల విభాగం సన్నాహాలు చేస్తోంది. నలుగురు నీట్ యుజి అభ్యర్థులతోపాటు వారి కుటుంబ సభ్యులతోసహా మొత్తం 13 మందిని ఇదివరకే బీహార్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో అనురాగ్ యాదవ్, సికందర్ యాదవేందు, నితీష్ కుమార్, అమిత్ ఆనంద్ ఉన్నారు.

## నీట్ పీజీ పరీక్ష వాయిదా..

న్యూఢిల్లీ: నీట్-పీజీ ప్రవేశ పరీక్షను కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ పరీక్ష ఆదివారం (జూన్ 23) జరగాల్సి ఉండగా, శనివారం రాత్రి పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పరీక్ష జరగబోయే కొత్త తేదీని వీలైనంత త్వరగా ప్రకటిస్తామని వెల్లడించింది.
విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని పరీక్షా ప్రక్రియ పవిత్రతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

## అమర్ నాథ్ గుహాలో 'ప్రథమ పూజ'



**అమర్‌నాథ్:** జమ్మూకశ్మీర్ కు వెళ్లే అమర్ నాథ్ యాత్ర 'ప్రథమ పూజ' శనివారం జరిగింది. శ్రీనగర్ లోని రాజ్ భవన్ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. జూన్ 29 నుంచి బాబా బర్ఫానీ కి మొక్కులు చెల్లించడానికి భక్తులు అమర్ నాథ్ ను దర్శించుకోవచ్చు. అమర్ నాథ్ యాత్ర ప్రశాంతంగా జరిగేందుకు ఏర్పాట్లన్నీ చేశామని జమ్మూకు చెందిన అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఏడిజిపి) ఆనంద్ జైన్ శుక్రవారం తెలిపారు. ఈ ఏడాది అమర్ నాథ్ యాత్ర జూన్ 29 నుంచి మొదలయి ఆగస్టు 19 వరకు సాగుతుంది. అమర్ నాథ్ గుహ మందిరం జమ్మూకశ్మీర్ లో ఉంది.

## సంపాదకీయం

# తొలి టాకీ చిత్రాల నటుడు ఎల్.వి.ప్రసాద్

భారతీయ సినిమాకు నడకలు నేర్పిన సినీ పరిశ్రమ ప్రజ్ఞాశాలి, తెలుగు సినిమాకు క్లాసిక్ అనదగ్గ సినిమాలు అందించిన దర్శకుడు ఆయన. సినీ నిర్మాతగా, దర్శకుడుగా, నటుడుగా సినీ నిఘంటువులో తనకంటూ కొన్ని పేజిలు సృష్టించుకున్న ఉద్దండుడు. మొట్ట మొదటి హిందీ టాకీ చిత్రం 'ఆలం అరా'తో పాటు తమిళ 'కాళిదాస్',తెలుగులో 'భక్త ప్రహ్లాద' వంటి మూడు భాషల్లో తెరకెక్కిన తొలి టాకీ సినిమాల్లో నటించిన ఘనత ఆయనకే సొంతం. దర్శకుడిగా 1949లో వచ్చిన 'మన దేశం' సినిమాతో ఎన్టీఆర్‌ను, ఆయనతో పాటు షావుకారు జానకి, సావిత్రి లాంటి గొప్ప నటులను వెండి తెరకు పరిచయం చేసిన ఘనత వహించిన గొప్ప వ్యక్తి ఆయన. ఇంతకీ ఆయన ఎవరో తెలుసా!? భారతీయ సినీ రంగానికి ఎనలేని సేవలందించి నందుకు గాను దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును అందుకున్న ఎల్.వి.ప్రసాద్. ఎల్.వి.ప్రసాద్ గా ప్రసిద్ధి చెందిన అక్కినేని లక్ష్మీవరప్రసాద రావు తెలుగు సినీ నిర్మాత, దర్శకుడు, నటుడు. ఎల్.వి. ప్రసాద్ చలన చిత్రరంగానికి ఎనలేని సేవ చేశారు. హిందీ, తమిళ, తెలుగు భాషలలో తొలి టాకీ చిత్రాలయిన ఆలం ఆరా, కాళిదాస్, భక్త ప్రహ్లాద మూడింటిలోనూ ఆయన నటించారు. తెలుగు వారిలో ఆయన ఒక్కరే ఈ ఘనత సాధించారు. హిందీ, తమిళ, తెలుగు, కన్నడ వంటి పలు భారతీయ భాషలలో 50 చిత్రాల వరకు ఆయన దర్శకత్వం వహించటం గానీ, నిర్మించటం గానీ, నటించటం గానీ చేసారు. ఎల్.వి.ప్రసాద్ దర్శకత్వంలో పల్నాటి యుద్ధం, ద్రోహి,సంసారం, మిస్సమ్మ, అప్పు చేసి పప్పు కూడు తదితర ఆణి ముత్యాల లాంటి సినిమాలు అందించారు. ఆయన జనవరి 17,1908 లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఏలూరు తాలూకా లోని సోమవరప్పాడు గ్రామంలో అక్కినేని శ్రీరాములు, బసవమ్మ దంపతుల రెండవ సంతానముగా జన్మించారు. రైతు కుటుంబంలో పుట్టిన ప్రసాద్ గారాబంగా పెరిగారు. చురుకైన వారే అయినా చదువులో ఎప్పుడూ శ్రద్ధ చూపలేదు. ఉ రూరా తిరిగే నాటకాల కంపెనీలు, డాన్సు ట్రూపుల డప్పుల చప్పుల్లు ప్రసాద్ ను ఆకర్షించేవి. పాత అరిగి పోయిన సినిమా రీళ్ళను ప్రదర్శించే గుడారపు ప్రదర్శన శాలల్లో ప్రసాద్ తరచూ వాటిని ఆసక్తిగా చూసేవారు. స్థానిక నాటకాల్లో తరచుగా చిన్న చిన్న వేషాలు వేసేవారు. అదే ఆసక్తి పెద్దయ్యాక కదిలే బొమ్మలు, నటనపై ఆసక్తిని పెంచి సినిమా రంగంలో ప్రవేశించ డానికి పునాదులు వేసింది. 1908 జనవరి 17న జన్మించిన ఎల్.వి.ప్రసాద్ వివాహం సౌందర్య మనోహరమ్మతో జరిగింది. ఒకరోజు ఆయన సినిమాల్లో నటించాలనే కోరికతో జేబులో 100రూ.లతో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి ముంబయికి వెళ్లిన ఆయనకు ఎంతో కష్టపడగా చివరికి "ఆలం అరా" చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. ఆ చిత్రందేశం లోనే తొలి టాకీ సినిమా. అందులో ఎల్.వి.ప్రసాద్ ఓ పాత్ర చేశారు. ఈ చిత్రంలో నటించి నందుకు గాను ఎల్.వి.ప్రసాద్‌కు నెలకు 30 రూపాయలను అంద జేశారు. ముంబై వీనస్ ఫిల్మ్ కంపెనీలో చిన్నచిన్న పనులు చేసే సహాయకుడుగా జీవితాన్ని ప్రారంభించిన ప్రసాద్, శబ్ద చిత్రం "స్టార్ ఆఫ్ ది ఈస్ట్"లో చిన్న పాత్ర పోషించారు. ఆ తర్వాత హెచ్.ఎం.రెడ్డి దర్శకత్వంలో రూపు దిద్దుకున్న తమిళ చిత్రం కాళిదాస, తెలుగు చిత్రం భక్త ప్రహ్లాదలో ఆయన నటించారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగిన ఎల్.వి.ప్రసాద్ 1950లో విడుదలైన విజయ పిక్చర్స్ వారి "షావుకారు" సినిమాకు "దర్శకత్వం" వహించి పేరు తెచ్చుకున్నారు. ఎన్టీ రామారావు, జానకి నటించిన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ప్రసాద్ ప్రొడక్షన్‌ను నెలకొల్పిన ఎల్.వి.ప్రసాద్ హిందీలో మిలన్, ఖిలోనా, ససురాల్, ఏక్ దూజే కె లియే వంటి సూపర్ హిట్ చిత్రాలను నిర్మించి ఎంతో పాపులారిటీ సంపాదించారు. 1931లో ఆలం ఆరా – మొదటి హిందీ టాకీ సినిమా, 1931లో కాళిదాస్ – మొదటి తమిళ టాకీ సినిమా, 1931లో భక్తప్రహ్లాద – మొదటి తెలుగు టాకీ సినిమా, 1933 లో సీతా స్వయంవర్ (హిందీ), 1940లో బోండాం పెళ్ళి (తెలుగు), 1940లో చదువుకున్న భార్య, 1982లో రాజా పార్వాయి (తమిళం), చిత్రాలలో ఆయన నటించారు. మిస్సమ్మ (1955), గృహ ప్రవేశం (1947), పల్నాటి యుద్ధం (1947), ద్రోహి (1948), మన దేశం (1949), సంసారం (1950), షావుకారు (1950) చిత్రాలకు దర్శకత్వం వహించారు. జూన్ 22 1994లో ఈ లోకాన్ని వీడి వెళ్లినా, తన చిత్రాలతో ప్రేక్షకుల మదిలో కొలువై ఉన్నారు. ఎల్వీ ప్రసాద్ స్మారకార్థం భారత తపాలా శాఖ 2006 సెప్టెంబరు 5న ప్రత్యేక తపాలా బిళ్ళను విడుదల చేసింది. ఎల్. వి. ప్రసాద్ హైదరాబాద్ లో నేత్ర వైద్యశాల స్థాపన కొరకు కోటి రూపాయల ధనం, బంజారా హిల్స్ లో ఐదు ఎకరాల స్థలం దానం చేశారు. ఆయన చేసిన త్యాగానికి గుర్తుగా ఆయన పేరును ఆ సంస్థ పేరు ముందు ఉంచారు.తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా ఎంతో మంది ప్రజలు ఇక్కడకు వచ్చి చికిత్స చేయించు కుంటారు. 34 ఏళ్ల క్రితం 1987లో చిన్న సంస్థగా మొదలై హైదరాబాదులో స్థాపించబడిన లాభాపేక్ష లేని, ప్రభుత్వేతర నేత్ర వైద్యశాల. సమాజంలోని అన్ని వర్గాలకు సమానమైన, సమర్థవంతమైన కంటి సంరక్షణ సంస్థ లక్ష్యం కాగా...అంతర్జాతీయ ఖ్యాతిని సొంతం చేసుకుంది ఈ కంటి ఆసుపత్రి.

# కదులుతున్న నీట్ డొంక




**పాట్నా, జూన్:** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ–కమ్–ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) యూజీ 2024 పరీక్షలో అక్రమాలు తవ్వేకొద్దీ బయటపడుతున్నాయి. బిహార్‌లో ఈ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు వచ్చిన వార్తలను గతవారం కేంద్ర విద్యాశాక, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తోసిపుచ్చింది. లీకేజీకి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని ఆరోపణలు కొట్టిపారేసింది. ప్రతి పక్షాలు అసత్యాలు ప్రచారం చేస్తున్నట్లు ఆరోపించాయి. అయితే, పేపర్ లీక్ నిజమేనని ఆధారాలతో సహా బయటికొచ్చింది. పరీక్ష ముందురోజు రాత్రే నీట్ ప్రశ్నపత్రం జవాబులతో సహా తమకు అందిందని బిహార్‌లో అరెస్టయిన నలుగురు పోలీసులకు వెల్లడించారు. ఈ వ్యవహారం ప్రస్తుతం దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం లేపుతోంది.బీహార్‌లో అరెస్టయిన నలుగురు విద్యార్థుల్లో అభిలాషి అనురాగ్ యాదవ్, అతని మామ దానాపూర్ మున్సిపల్ కౌన్సిల్‌లో జూనియర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న సికందర్‌తో పాటు మరో ఇద్దరు విద్యార్థులు నితీష్ కుమార్, అమిత్ ఆనంద్ ప్రస్తుతం పోలీస్ కస్టడీలో ఉన్నారు. కోటాలోని కోచింగ్ హబ్‌లో పరీక్షకు సిద్ధమవుతున్న అనురాగ్ యాదవ్‌కు అతని మామ సికందర్ ఫోన్ చేసి పేపర్ లీక్ చేసేందుకు ప్లాన్ చేశానని, వెంటనే ఇంటికి రావాలని కోరాడు. వెంటనే మామవద్దకు చేరుకున్న అనురాగ్ యాదవ్ రాత్రికి రాత్రే జవాబులను చదివి కంఠస్థం చేశాడు. మరుసటి రోజు పరీక్ష కేంద్రానికి వెళ్లిన అనురాగ్ యాదవ్‌కు సరిగ్గా కంఠస్థం చేసిన ప్రశ్నలే రావడంతో అన్ని సమాధానాలు రాశాడు. అనురాగ్‌తోపాటు అతని స్నేహితులు నితీష్ కుమార్, అమిత్ ఆనంద్ అనే మరో ఇద్దరు విద్యార్థులకు కూడా సికిందర్ పేపర్ అందించాడు. వీరు నీట్ క్లియర్ చేయడానికి ఒక్కొక్కరి నుంచి రూ.30 నుంచి 32 లక్షల వరకు వసూలు చేసినట్లు నిందితులు పోలీసుల ఎదుట నేరాన్ని అంగీకరించడంతోపాటు.. ఇదే విషయాన్ని రాత పూర్వకంగా రాసిచ్చారు. దీంతో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం మరింత తీవ్రమైంది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై దర్యాప్తునకు బిహార్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటుచేసింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 14 మందిని అరెస్టు చేశారు. మరోవైపు నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది.

# జనసేనానికి కలిసిన ఎమ్మిగనూరు ఇంఛార్జి రేఖగౌడ్

- చేనేత, త్రాగునీరు, సాగునీటి, సమస్యలపై అధినేతకు వినతి
- నియోజక వర్గంలో అభివృద్ధికి అన్ని విధాల ఆదుకోవాలన్న రేఖగౌడ్



**ఎమ్మిగనూరు:** ఎమ్మిగనూరు పట్టణంలో జనసేన పార్టీ అధ్యక్షులు డిప్యూటీ సీయం కొణిదల పవన్ కళ్యాణ్ గారిని శనివారం రోజున జనసేన పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంఛార్జి రేఖగౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపి నియోజకవర్గ పరిస్థితులను అధినేతకు వివరించినట్లు మీడియాకు తెలిపారు, ఎమ్మిగనూరులో అధికంగా అన్ని వర్గాల ప్రజలు చేనేత రంగాన్ని నమ్ముకున్నారని నేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవాలని అలాగే నియోజకవర్గ పరిధిలోనీ చాలా గ్రామాల్లో దశాబ్దాలుగా నెలకొన్న త్రాగునీరు మరియు సాగునీటి సమస్య తీవ్రంగా ఉందని శాశ్వత పరిష్కారం కోసం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిప్యూటీ సీయం పవన్ కళ్యాణ్ ను కోరినట్లు జనసేన పార్టీ ఇంఛార్జి రేఖగౌడ్ తెలిపారు, సానుకూలంగా స్పందించిన పవన్ ఎంతో నమ్మకంతో ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని భారీ విజయంతో గెలిపించారని వారు ఎదుర్కొనే సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కారం కోసం పనిచేస్తే తమ సహకారం ఎప్పుడు ఉంటుందని హామీ ఇచ్చారని రేఖగౌడ్ తెలిపారు,అలాగే జిల్లాల వారీగా జనసేన అధ్యక్షులు త్వరలోనే కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్థారని చెప్పడం జరిగిందన్నారు, మొదటగా రాయలసీమ జిల్లాల నుంచే సమావేశలను ప్రారంభించేలా ప్రతి నియోజకవర్గ జనసేన నాయకులను క్రియాశీలక కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించే వరకు పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా నిలబడాలని కష్టపడి పనిచేసిన ప్రతి జన సైనికుడికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని జనసేన అధినేత డిప్యూటీ సీయం పవన్ సూచించినట్లు రేఖగౌడ్ తెలిపారు.

# విలవిలలాడుతున్న మక్కా



**మక్కా, జూన్ :**పవిత్ర మక్కా మాడిపోతుంది. మండే ఎండలకు విలవిలలాడుతోంది. గాలిలో తేమ తగ్గిపోయి, వేడిగాలులు తీవ్రంగా విస్తుండడంతో జనం నరకం చూస్తున్నారు. మక్కా గ్రాండ్ మసీదు వద్ద 51.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడంతో హజ్ యాత్రికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వేడిగాలులు, తీవ్రమైన ఉక్కపోత వల్ల ఇప్పటివరకు 650 మంది హజ్ యాత్రికులు మృత్యువాత పడ్డారు. హజ్ యాత్ర చరిత్రలో ఇటువంటి విషాదం గతంలో ఎన్నడూ చోటు చేసుకోలేదు. యాత్రికుల మృతి విషయాన్ని సౌదీ దౌత్య వ్యక్తులు ధ్రువీకరించారు. మరణించిన యాత్రికుల్లో 323 మంది ఈజిప్షియన్లు ఉన్నారని తెలుస్తోంది. వేడి గాలులు, ఉక్కపోత వల్ల చనిపోయిన వారి మృతదేహాలను(550 మంది) మక్కాలోని ఆల్ ముయిసెమ్ ఆసుపత్రిలో భద్రపరిచారు.. ఇక జోర్దాన్ ప్రాంతంలో కూడా 60 మంది వరకు చనిపోయారు. గతంలో వేడి గాలుల వల్ల ఈ ప్రాంతంలో 41 మంది చనిపోయారు.. ఇక వివిధ దేశాల లెక్కల ప్రకారం మొత్తంగా హజ్ యాత్రలో వేడిగాలు వల్ల చనిపోయిన వారు 577 మంది అని తెలుస్తోంది.మక్కా ప్రాంతంలో ఇస్లాం ఐదు స్తంభాలలో ఒకటిగా హజ్ నిలుస్తోంది. ముస్లింలు తమ జీవితకాలంలో ఒక్కసారైనా హజ్ ను దర్శించుకోవాలని భావిస్తారు. దీనికోసం ఎంత కష్టమైనా పడతారు. వాస్తవానికి ఈసారి హజ్ యాత్ర ప్రారంభ సమయంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయని.. గతంతో పోల్చితే ఈసారి 0.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు పెరగడం.. వేడి గాలులు తీవ్రంగా ఉండడంతో అది యాత్రికుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని సౌదీ అరేబియా అధికారులు అంటున్నారు. మక్కా గ్రాండ్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెల్సియస్ దాటడంతో యాత్రికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఎండ నుంచి, వేడి గాలుల నుంచి తమను తాము కాపాడుకునేందుకు ఈజిప్షియన్లు ఇతర ప్రాంతాలకు పరుగులు తీశారు. దీంతో వారు తప్పిపోయారు. ఈ విషయాన్ని ఈజిప్ట్ విదేశాంగ మంత్రిత్వ శాఖ సౌదీ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. అయితే వారందరినీ కూడా వడ దెబ్బ మృతుల కింద సౌదీ అధికారులు ఆ నమోదు చేసినట్టు తెలుస్తోంది. ఇక యాత్రికుల్లో 2000 మంది వడదెబ్బకు గురి కావడంతో.. వారందరికీ స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. గత ఏడాది హజ్ యాత్ర సమయంలో వివిధ దేశాలకు చెందిన 240 మంది యాత్రికులు వడదెబ్బకు గురై మరణించారు..ఈసారి వడ తీవ్రంగా ఉండడంతో మక్కా సమీపంలోని మినా ప్రాంతంలో పాత్రికేయులు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన సేవకులు యాత్రికులకు శీతల పానీయాలు, ఐస్ క్రీమ్ పంపిణీ చేస్తున్నారు. చల్లని నీళ్లను అందిస్తుండడంతో.. ఒంటిపై పోసుకొని చల్లబరుచుకుంటున్నారు. ఎండ వేడిమి నుంచి యాత్రికులు తమను తాము రక్షించుకునేందుకు గొడుగులు, హైడ్రేట్ డ్రింకులు వాడాలని సూచిస్తున్నారు. అయితే ఆచారంలో భాగంగా మంటూ అరాఫత్ ప్రార్థన సమయంలో యాత్రికులు బహిరంగంగా ఉండాల్సి ఉంటుంది.. అలాంటి సమయంలో పైన వేడి, తీవ్రమైన ఉక్కపోత వల్ల యాత్రికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ సంవత్సరం సుమారు 1.8 మిలియన్ల మంది హజ్ యాత్రలో పాల్గొన్నారు. ఇందులో విదేశాల నుంచి 1.6 మిలియన్ల మంది వచ్చారు.. వీరందరికీ సౌదీ అరేబియా ప్రభుత్వం అపారమైన భద్రత కల్పించింది. అయితే ఈసారి ఎండలు పెరగడంతో యాత్రికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. వడదెబ్బ మృతుల్లో ఎక్కువ శాతం మధుమేహం, రక్తపోటు సంబంధిత వ్యాధులు ఉన్న వారేనని సౌదీ అరేబియా ఆస్పత్రి వర్గాలు అంటున్నాయి.

# డ్వాక్రా భవనాన్ని ప్రారంభించిన జడ్పీ చైర్మన్



**శామీర్ పేట, (గరుడ వార్త):** మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి అన్నారు. మజీద్ పూర్ గ్రామంలో డ్రాక్ర మహిళా సహకార సంఘం నూతన భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా అభివృదే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ డ్వాక్రా భవనాన్ని డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి పూర్ణిమ, ఎంపీటీసీ అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఏళ్ల మల్లేష్ ముదిరాజ్, గ్రామస్తులు రమేష్, భాస్కర్ గౌడ్, నర్మదా, వెంకటేష్, సత్యవతి, నవనిత, వనజ, గ్రామమహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మహిపాల్ రెడ్డిపై ఈడీ కేసు

**హైదరాబాద్:** పటాన్ చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇళ్లు, ఆస్తులపై సోదాలు చేసిన ఈడీ సంచలన ప్రకటన చేసింది. మైనింగ్ పేరుతో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు మహిపాల్ రెడ్డి రూ.300 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారని ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. మైనింగ్ వ్యవహారంలో వీరి ద్వారా రూ.39 కోట్ల మేర ప్రభుత్వానికి నష్టం చేకూరినట్లు అధికారులు గుర్తించారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడి ఇల్లు, ఆఫీసులపై ఈడీ గత రెండు రోజులుగా సోదాలు చేపట్టింది. మనీ లాండరింగ్, హవాలా అనుమానాలతో ఈడీ ఆకస్మిక సోదాలు చేసింది. రియల్ ఎస్టేట్ లో ఈ డబ్బు పెట్టారని గుర్తించిన ఈడీ సోదాలు పూర్తయ్యాక దీనిపై ఓ ప్రకటన చేసింది.మహిపాల్ రెడ్డి మైనింగ్ పేరుతో భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారని, దాని విలువ దాదాపు రూ. 300 కోట్ల మేర ఉంటుందని ఈడీ భావిస్తోంది. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరులు చేసిన చర్యల కారణంగా ప్రభుత్వానికి రూ. 39 కోట్లు నష్టం వాటిల్లిందని ఈడీ పేర్కొంది. అక్రమంగా సంపాదించిన డబ్బును ఆపై రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్వెస్ట్ చేశారని.. కొంత డబ్బు బ్యాంక్ అకౌంట్లలో ట్రాన్స్ క్షన్ చేసినట్లు గుర్తించామని ఓ ప్రకటనలో ఈడీ అధికారులు ప్రకటించారు. తాము చేపట్టిన సోదాలతో రూ.19 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బినామీల పేర్ల మీద ట్రాన్సాక్షన్స్ జరిపారని, కొన్ని బ్యాంక్ లాకర్స్‌ని తెరిచి పూర్తి స్థాయిలో లెక్క కట్టాల్సి ఉందన్నారు. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్ రెడ్డి ఇంటికి మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు వెళ్లి వారిని పరామర్శించారు. ఈడీ తనిఖీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో హరీష్ రావు వెంటన బీఆర్ఎస్ నేతలు సంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాణిక్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, వంటేరు ప్రతాప్ రెడ్డి ఉన్నారు. అనంతరం హరీష్ రావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను దర్యాప్తు సంస్థలైన ఈడీ, ఐటీ దాడులతో వేదిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇంట్లో ఎలాంటి అవినీతి ఆస్తులు దొరకలేదని, కానీ తమ ఎమ్మెల్యేలను భయపెట్టి లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. 'బిహార్, గుజరాత్ లలో నీట్‌రాష్ట్రంలో లక్షల విద్యార్థులు నీట్ పరీక్ష వ్రాశారు, వారిభవిష్యత్తు అయోమంలో ఉంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఒత్తిడికి గురి చేస్తుంది. అధికార పార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బెదిరింపు ధోరణికి పాల్పడుతున్నారు. మా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి చాలా ధైర్యంగా ఉన్నారు. ఆయన ఏ తప్పు చేయలేదు.. ఈడీకి ఏలాంటి అక్రమ ఆస్తులు దొరకలేదు. కానీ ఇంట్లో చిన్న పిల్లలు ఏడుస్తున్నా కర్కశంగా ఈడీ దాడులు చేయటం దారుణం. న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకం ఉ ఒదన్నారు' హరీష్ రావు.

# విద్యా వ్యవస్థను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం..

**సిద్దిపేట:** సిద్దిపేట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో పాఠశాలలు ప్రారంభమై పది రోజులు గడుస్తున్నా విద్యార్థులకు కనీసం పాఠ్య పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు కూడా అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలస్యం చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నాము. రాష్ట్రంలో నూతన మద్యాన్ని ఆహ్వానిస్తూ మద్యానికి మంత్రి నియమించినటువంటి కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి విద్యను అందించడానికి విద్యామంత్రి దొరకట్లేదా. విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేయడం మంచి పద్ధతి కాదని తెలియజేశారు, వెంటనే రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలకు సకాలంలో పాఠ్య పుస్తకాలను, విద్యార్థులకు డ్రెస్లను అందించాలని జిల్లా విద్యార్థి విభాగం పక్షాన తెలియజేస్తున్నామ. గత పది సంవత్సరాలుగా గురుకుల పాఠశాలను ప్రారంభించి మంచి విద్యను అందిస్తూ విద్యను గొప్పగా తీర్చిదిద్దిన ఘనత గౌరవ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గారిది, అది జీర్ణించుకోలేని రేవంత్ ప్రభుత్వం గురుకుల వ్యవస్థ పైన కనీసం అవగాహన లేకుండా హాస్యాస్పద వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని, గుంపు మేస్త్రికి విద్య పైన కనీస అవగాహన పెంచుకోవాలని మేము విజ్ఞప్తి చేస్తున్నాము. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే బాలికలకు మోటార్ వాహనాలను అందిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఏమైంది అని గుర్తు చేశారు, రాష్ట్రంలో ఉన్న కళాశాలలకు వెంటనే ఫీజు రియంబర్స్మెంట్ని విడుదల చేయాలని బి ఆర్ఎస్ విద్యార్థి విభాగ తరఫున డిమాండ్ చేస్తున్నామని తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త పయ్యావుల శ్యామ్. పట్టణాధ్యక్షుడు మహిపాల్ గౌడ్. వివిధ మండలాల అధ్యక్షులు గుజ్జ రాజు,గోవిందారం రవి,బండి శ్రీకాంత్, పెర్క మధు, భాను చందర్, ఇరుగంటి రమేష్, అప్పాల శేఖర్, రాగారం గ్రాము, శ్రవణ్ గౌడ్,వ్యాటు ప్రశాంత్,నరేష్ యాదవ్, మెరుగు మాధవ్,రాజశేఖర్ రెడ్డి, మైలారం వంశీ, పోతుల నరేష్, బాలకృష్ణ. నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ అధికారులను చూసి పరుగెత్తిన ఎస్సై

**కరీంనగర్:** కరీంనగర్ జిల్లాలోని రాయికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇసుక ట్రాక్టర్ల రవాణా విషయంలో చోటు చేసుకున్న లావాదేవీల్లో అక్కడి ఎస్ఐకి రూ. 25 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. అయితే డబ్బులు ఇవ్వడంలో జాప్యం జరిగింది. దీంతో తరుచూ వేధిస్తున్న సదరు ఎస్ఐపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే మధ్యవర్తి ద్వారా ఈ డబ్బులు ఇచ్చేందుకు నిర్ణయం జరగగా, డబ్బులు తీసుకుంటున్న క్రమంలో ఎస్ఐని రెడ్ హ్యాండెడ్గా పట్టివ్వాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో. శుక్రవారం రాత్రి 11 గంటల నుండి 12 గంటల ప్రాంతంలో బాధితులు, ఏసీబీ అధికారులు స్టేషన్ కు చేరుకున్నారు. అయితే ఎస్ఐని పోలీస్ స్టేషన్కు పిలిపించగా, ఆయన స్టేషన్ కు చేరుకున్న తరువాత ఏసీబీ అధికారులను గమనించిన ఎస్ఐ వెంటనే వెనక్కి తిరిగి పరుగులు తీశాడు. దీంతో అతన్ని పట్టుకోలేకపోయిన ఏసీబీ అధికారులు మధ్యవర్తిని అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న ఎస్ఐ ఆచూకి కోసం ఏసీబీ అధికారులు గాలింపు చేపట్టారు. కాగా, ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న ఏసీబీ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

========================

## పౌష్టిగా ఆహారం అందించడంలో అధికారులు విఫలం

**– విద్యార్థుల సమస్యల వెల్లువ**

**– తాగటానికి మంచినీళ్ళు లేక విద్యార్థుల ఇబ్బందులు**

**కౌతాళం:** కౌతాళంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని,విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించడంలో అధికారులు విఫలమయ్యారని విద్యార్థులు వాపోయారు. సరైన భోజనం లేక ఉడకని గుడ్లు భోజనంలో పురుగులు సరైన ఆహారం అందించడంలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు విద్యార్థులు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మధ్యాహ్నం తింటున్న భోజనంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు అన్నారు. అలాగే ఆహారంతో పాటు వారం రోజుల నుండి త్రాగునీరు లేక మధ్యాహ్న భోజన సమయంలో బయట నుంచి తెచ్చుకుని తాగుతున్నామని విద్యార్థులు వాపోయారు. ఉపాధ్యాయులకు చెప్పిన సమస్య తీరండం లేదని అన్నారు. కనీసం మీరు అందించడంలో కూడా అధికారులు విఫలమయ్యారని తల్లిదండ్రులు వాపోయారు. ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో సరైన సదుపాయాలు లేక ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థులు తెలిపారు.ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పందులు కూడా వీర విహారం చేస్తున్నాయని వారన్నారు. దీనిపై జిల్లా అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలని కోరుచున్నారు.

=============================

## త్రాగునీటి విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి: ఎమ్మార్పీఎస్ డిమాండ్

**శ్రీశైలం:** నంద్యాల జిల్లా పాములపాడు గ్రామంలో త్రాగునీటి విషయంలో అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ లింగాల స్వాములు మాదిగ అబ్రహం అధికారులను డిమాండ్ చేశారు ఈ సందర్భంగా పాములపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఏవో కరుణసాగర్ గారికి వినతిపత్రం ఇస్తూ ఈ సందర్భంగా స్వాములు మాదిగ మాల మహానాడు రాయలసీమ నల్లమల అబ్రహం మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో త్రాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి మంచి నీటిని విడుదల చేసే విధంగా అధికారులు చూడాలన్నారు.అదే మాదిరిగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు మలేరియా డెంగ్యూ అతిసారా విష జ్వరాలు రాకుండా గ్రామాలలో బ్లీచింగ్ పౌడర్ ను పిచికారి చేయాలన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే డాక్టర్ల ద్వారా గ్రామాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలను రోగాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వెంటనే అధికారులు పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి పెట్టి గ్రామాలలో చెత్త మురుగునీరు లేకుండా చేయాల్సిన బాధ్యత ఆయా గ్రామపంచాయతీ అధికారులకు గ్రామ సర్పంచులకు ఉందని. సర్పంచులు ఇంతవరకు గ్రామాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లిన దాఖలాలు లేవని 13 ఫైనాన్స్ 14 ఫైనాన్స్ నిధులు దుర్వినియోగం చేయకుండా పారిశుద్ధ్యం పై దృష్టి పెట్టాలని నిర్లక్ష్యం చేస్తే గ్రామ సర్పంచులపై మరియు పంచాయతీ అధికారులను బాధ్యులను చేసి వారిపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఖీ ఆగస్టు మద్దూరు స్వాములు రాజన్న తదితరులు పాల్గొన్నారు

==========================

## విశాఖ స్టీల్ ప్లాంట్ని రక్షించండి సారు

**పరవాడ:** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ని అన్ని విధాల పరిరక్షించాలని కంపెనీకి వర్కింగ్ కాపిటల్ పదివేల కోట్ల రూపాయలు సమకూర్చాలని కేంద్ర ఉక్కు పరిశ్రమ శాఖ మాత్యులు శ్రీనివాస వర్మ ని భీమవరంలో ఐఎన్టిసి ప్రతినిధి బృందం కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది. విశాఖపట్నం ఒకప్పుడు సైల్లో ఉండేది తర్వాత 1982లో విడదీసి విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేశారు అని అన్నారు అలా ఏర్పాటు చేసినప్పుడు సైల్ లో ఉన్న సదుపాయాలని అన్నిటిని స్టీల్ ప్లాంట్లో కొనసాగిస్తామని అప్పటి ప్రభుత్వం చెప్పింది అని చెప్పారని కానీ నేటి వరకు ఐరన్ వర్ మాయిన్స్ అనేది కేటాయించకపోవడం వల్ల ఉత్పత్తి చేయడానికి చాలా ఎక్కువ కాస్ట్ అయ్యే పరిస్థితి ఏర్పడుతుందని కంపెనీ ఆర్థికంగా ముందుకు పోవాలన్న తక్షణమే విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ని సైల్ లో విలీనం చేయాలని అలానే ఎంప్లాయిస్ తక్కువకి సిబ్బందితో ఎక్కువ ఉత్పత్తి చేసి ఈ కంపెనీ కోసం శ్రమిస్తున్నారని వెంటనే వేతన ఒప్పందం అమలు చేయాలని కోరడం జరిగినది . వీటిపై మంత్రి శ్రీనివాస వర్మ సానుకూలంగా స్పందించి విశాఖ స్టీల్ ప్లాంట్ ని అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయుకులు మంత్రి రాజశేఖర్,మంత్రి గిరి మరియు తదితరులు పాలొగొన్నారు.

# తెలంగాణ జాతిపిత!



తెలంగాణ చరిత్రలో పోరాట యోధులు ఎవరి పేరు వారు లిఖించుకున్నా కానీ చరిత్ర మొదటి పుటపై యావత్ తెలంగాణ లోని నాలుగు కోట్ల ప్రజలు ముక్తలేఖినితో సువర్ణాక్షరాలతో రాసిన పేరు ఆచార్య జయశంకర్ సార్. ప్రగతిశీల, ప్రజాతంత్ర, సామాజిక, బహుజన వామపక్ష ఉద్యమాలను తన రెండు చేతులతో ఆహ్వానించే చైతన్యం గల కాకతీయ పోరుగడ్డ వరంగల్లు లోని అక్కంపేటలో ఉలి, బాడిస రంపపు శబ్దాల మధ్య 1934 ఆగస్టు 6న తెలంగాణ జాతిని జాగృతం చేస్తూ ఒక గొంతు శ్రీకారం చుట్టుకొని పిడికిలి బిగించింది. కాల క్రమంలో అది యావత్ తెలంగాణ పరివ్యాప్తమై మూడు తరాలుగా వేల గొంతులను సృష్టించి లక్షల పిడికిళ్లు పైకెత్తేలా చేసి జై తెలంగాణను రణనినాదంగా మార్చి నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను విజయపథం వైపు నడిపించిన మహోన్నత వ్యక్తిగా పరిణమించింది. 1952లో ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ ఉద్యమంలోనూ, నాన్ ముల్కీ గో బ్యాక్ ఉద్యమంలోనూ పాల్గొన్న యువ కెరటం 1969లో తొలిదశ ఉద్యమంలో తదుపరి 1996లో మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర వహించారు. ఫసల్ అలీ కమిటీ నుండి శ్రీకృష్ణ కమిటీ వరకు తెలంగాణపై ఏర్పడ్డ ప్రతి కమిటీకి ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతపై గణాంకాలతో సహా నివేదిక నందించిన మహోపాధ్యాయుడు. విశ్రాంతి లేకుండా నిరంతరం భావజాల వ్యాప్తిలో తలమునకలై ప్రజలను చైతన్య పరుస్తూ తెలంగాణ ఆశావహులను ఏకీకరణ చేస్తూ లక్ష్య సాధన కోసం 'తెలంగాణలో ఏం జరుగుతోంది' 'తెలంగాణ ఒక డిమాండ్ వక్రీకరణలు, వాస్తవాలు', 'తల్లడిల్లుతున్న తెలంగాణ' వంటి అనేక పుస్తకాలను రాసి ప్రజలను చైతన్య పరిచిన అసలు సిసలైన తెలంగాణ ఉద్యమకారుడు.

సహజంగా తెలంగాణలో ఎవరినైనా అన్నా అని పిలిచే సంప్రదాయం ఉంటుంది కానీ తెలంగాణను తరగతి గదిగా చేసుకొని ప్రజలకు తెలంగాణ ఆవశ్యకత బోధించిన గురువు కనకే యావత్ తెలంగాణ ఆయనను సార్ అని పిలుస్తూ తెలంగాణ సిద్ధాంతకర్తగా గౌరవిస్తుంది. ఒకటి రెండు రాజకీయ పార్టీలు మినహాయించి అన్ని పార్టీలను కలిసి సావధానంగా తెలంగాణ ప్రజల ఆకాంక్షను వినిపించి వారిని ఉద్యమంలో భాగస్వామిగా మలచడంలో ఆయన పాత్ర అనన్య సామాన్యం, అనితరసాధ్యం. ఆర్ఎస్ఎస్ నుండి ఆర్ఎస్యూ వరకు అన్ని వర్గాలను తెలంగాణ బాట నడిపించిన ధీశాలి. భావజాలం, ఉద్యమం, రాజకీయం సమాంతరంగా నడవాలని భావించాడు. భావజాల వ్యాప్తి ఉద్యమం బలంగా ఉన్నప్పటికీ రాజకీయంగా స్తబ్దతగా ఉండటం సార్ జీర్ణించుకోలేకపోయారు. ఆ క్రమంలోనే ఆ రాజకీయ శూన్యతను పూర్తి చేయడంలో సఫలీకృతుడైనాడు. అయితే, 2011 జూన్ 21న తెలంగాణ స్వతంత్ర రాష్ట్రంగా కనులు తెరవకముందే జయశంకర్ సార్ కనుమూయడం దురదృష్టకరం. జయశంకర్ సార్ కేవలం భౌగోళిక తెలంగాణ మాత్రమే కోరుకోలేదు. విడిపోవడం మాత్రమే అన్ని సమస్యలకు పరిష్కారం కాదని తెలిపేవారు. తెలంగాణ కేవలం రాజకీయ సమస్య మాత్రమే కాదని ఇది ఒక సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విముక్తి సమస్య అనీ, అన్నింటికీ మించి ఇది ఒక ఆత్మగౌరవ సమస్య అనీ నినదించారు. ఆయన ప్రజలందరికీ అర్థమయ్యేలా, నీళ్లు, నిధులు, నియామకాలు అన్న నినాదాన్ని ప్రజల హృదయాల్లో బలంగా నాటుకుపోయేలా తీసుకెళ్లారు. వనరుల పంపిణీలో జరిగిన దోపిడీని గణాంకాలతో వివరించడమే కాకుండా దానిని ఏ రకంగా సవరించడం సాధ్యమవుతుందో వివరించారు. రాష్ట్రం ఏర్పడితే జీవనదులైన కృష్ణ, గోదావరి జలాల్లో మన వాటా మనకు దక్కుతుందని న్యాయబద్ధంగా రావలసిన వాటా వస్తే తెలంగాణలో ఒక కోటి ఎకరాలు సస్యశ్యామలమవుతాయని, ప్రతి గ్రామానికి తాగునీరు అందుతుందనీ భావించారు. అటవీ సంపద, బొగ్గు సున్నపురాయి గ్రానైట్ వంటి ఖనిజ సంపదలు ఈ ప్రాంత అభివృద్ధికి వినియోగించబడితే ఆర్థిక స్వావలంబన సాధనలో దేశంలోని మొదటి రాష్ట్రంగా విరాజిల్లుతుందని ఆశించారు. సామాజిక ఉద్యమాలను ప్రోత్సహిస్తూ సామాజిక చైతన్యం ప్రతి వ్యక్తికి అవసరమని తెలంగాణ ఏర్పాటు అయితే అట్టడుగు వర్గాలు తల ఎత్తుకొని జీవించే స్థితిని పొందుతారని సామాజిక న్యాయం పరిఢవిల్లుతుందని లేని పక్షంలో సామాజిక, ప్రజాస్వామ్య తెలంగాణ దిశగా పోరాడాలని యువతకు పిలుపునిచ్చారు. 1952లో ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ ఉద్యమంలోనూ, నాన్ ముల్కీ గో బ్యాక్ ఉద్యమంలోనూ పాల్గొన్న యువ కెరటం 1969లో తొలిదశ ఉద్యమంలో తదుపరి 1996లో మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర వహించారు. ఫసల్ అలీ కమిటీ నుండి శ్రీకృష్ణ కమిటీ వరకు తెలంగాణపై ఏర్పడ్డ ప్రతి కమిటీకి ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతపై గణాంకాలతో సహా నివేదిక నందించిన మహోపాధ్యాయుడు. విశ్రాంతి లేకుండా నిరంతరం భావజాల వ్యాప్తిలో తలమునకలై ప్రజలను చైతన్య పరుస్తూ తెలంగాణ ఆశావహులను ఏకీకరణ చేస్తూ లక్ష్య సాధన కోసం 'తెలంగాణలో ఏం జరుగుతోంది' 'తెలంగాణ ఒక డిమాండ్ వక్రీకరణలు, వాస్తవాలు', 'తల్లడిల్లుతున్న తెలంగాణ' వంటి అనేక పుస్తకాలను రాసి ప్రజలను చైతన్య పరిచిన అసలు సిసలైన తెలంగాణ ఉద్యమకారుడు. తెలంగాణ పరిశ్రమలకు కేంద్రంగా విలసిల్లాలని, ఉత్పత్తి వర్గాల శ్రమను దోపిడీ చేసే దళారీ వ్యవస్థలు లేకుండా మెరుగైన జీవనం గడపాలని తెలంగాణ ఒక మానవీయ తెలంగాణగా ఏర్పడాలని ఆశించారు. సార్ ఆశయాలు అనునిత్యం మనకు స్ఫురణకు రావాలి. తెలంగాణ ఉన్నంతవరకు ఈ మట్టి బిడ్డలు ఆయనను మాత్రమే తెలంగాణ జాతిపితగా గుర్తిస్తారు. సార్ ఆశయసాధనలో భాగస్వామి కావడమే మనం జయశంకర్ సార్కి ఇచ్చే ఘనమైన నివాళి.

## 'జీరో హంగర్' లక్ష్యాన్ని చేరగలమా..!




ఐక్యరాజ్యసమితి ప్రధాన శాఖలైన ప్రపంచ ఆహార సంస్థ (యఫ్ఏఓ), యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్మెంట్ (ఐయఫ్ఏడి), వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ (డబ్ల్యూయఫ్పి)లు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనాల ఆధారంగా నివేదికను విడుదల చేశారు. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో(యస్డిజి) భాగంగా 2030 నాటికి ప్రపంచంలో ఆకలి చావులు, పోషకాహార లోపం లేకుండా చూస్తూ, 'జీరో హంగర్ (ఆకలి లేని లోకం)' సాధించాలనే ఉన్నత, ఉత్తమ నిర్ణయం తీసుకున్నారు. ప్రపంచంలో పోషకాహారలోపం అత్యధికంగా ఆసియా దేశాల్లో 418 మిలియన్లు ఉండగా, ఆఫ్రికాలో 282 మిలియన్లు ఉన్నారని తెలుస్తున్నది. ప్రత్యేక చర్యలు అమలు పరచని యెడల 2030 నాటికి 660 మిలియన్ల పేదలు ఉంటారని, ఆకలిని అంతం చేయడం అసాధ్యమని తెలుస్తున్నది. కరోనా మహమ్మారి విజృంభనతో అదనంగా 30 మిలియన్ల పేదలు ఆకలితో అలమటించారని తున్నారని అర్థం అవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా 237 కోట్లకు పైగా (ప్రతి ముగ్గురిలో ఒకరు) ప్రజలకు అవసరమైనంత ఆహారం లభించడం లేదని నివేదిక తెలుపుతున్నది. లింగ వివక్ష కారణంగా పురుషుల కన్న మహిళల్లో 10 శాతం అధికంగా ఆహార అభద్రత అనుభవిస్తున్నారు. ఆహార ధాన్యాల అధిక ధరలు, ఆదాయం తగ్గడం వల్ల 300 కోట్ల పేదలు పోషకాహారానికి దూరం అవుతున్నారు. పోషకాహారలోపం ప్రపంచ మానవాళికి శాపంగా వెంటాడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా 22 శాతం (150 కోట్లు) ఐదేండ్ల లోపు పిల్లలు శరీర వృద్ధి నిలిచిపోవడం (స్టంటింగ్)తో, 6.7 శాతం (4.54 కోట్లు) అభివృద్ధి తగ్గడం (వేస్టింగ్)తో, 5.7 శాతం (3.89 కోట్లు) అధిక బరువు (ఓవర్ వేయిట్) సమస్యలతో బాధ పడుతున్నారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో పిల్లల పోషకాహారలోపం అత్యధికంగా కనిపిస్తున్నది. ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల్లో 15–49 ఏండ్ల మహిళల్లో 30 శాతం రక్తహీనత (ఎనీమియా) సమస్య కనిపించగా, అమెరికా, యురొప్లో 14.6 శాతం మాత్రమే నమోదు అయ్యింది. గర్భిణి మహిళల్లో రక్తహీనత, పిల్లల్లో ఎదుగుదల మందగించడం, తల్లిపాల లభ్యత పడిపోవడం, తక్కువ బరువుతో శిశు జననాలు, ఓవర్ వేయిట్ పిల్లలు పెరగడం, వయోజనుల్లో స్థూలకాయం లాంటి సమస్యల మధ్య 2030 నాటికి ఆకలిని అంతం చేయడం అసాధ్యమని వివరించారు. ఆహార అభద్రత, పోషకాహారలోపం పెరగడానికి కారణాలుగా వాతావరణ అసాధారణ ప్రతికూల మార్పులు, ఆర్థిక మందగమనం, ఆర్థిక అసమానతలు, లాక్డౌన్/కర్ఫ్యూలు లాంటి అంశాలు పేర్కొనబడినవి. ఆహార ధాన్యాల దిగుబడి తగ్గడం, మార్కెటింగ్ శృంఖలంలో లోసుగులు (ఉత్పత్తి, పంట కోత, ప్రాసెసింగ్, రవాణ, మార్కెటింగ్, సరైన ధర పలకడం), ఆదాయాలు తగ్గడంతో పోషకాహారానికి పేదలు దూరం అవుతున్నారు.

# పరకాల నాగన్నను కాపాడుకోవడం మనందరి బాధ్యత!

పాట లేకుండా తెలంగాణ సమాజాన్ని ఊహించుకోలేము. పోరాట పాటలకు పుట్టినిల్లు తెలంగాణనే అనేంత మట్టిబాసల బాణీలు ఇక్కడ పురుడుపోసుకున్నాయి. భూస్వామ్య కౌర్యానికి, దొరల దౌర్జన్యానికి పాట జనం గోసను, యాసను, ఆయుధాలుగా మల్చుకోని పల్లె నుండి పట్నం వరకు అడవి నుండి కారడవి దాకా జంగు సైరన్ ఊదిన చరిత్ర ఈనేలకుంది. పీడిత, తాడిత ప్రజల పక్షాన పాటెప్పుడు అండగనే నిలబడింది. నాల్గు దశాబ్దాల కిందట యావత్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో వామపక్ష ప్రజాపోరాలు అనేక దారులను ఎంచుకున్నది. ఈ సమయంలోనే కొన్ని సంఘాలు అనేక నిర్బంధాలను ఎదుర్కొనాయి. తెలంగాణ ప్రాంతంలో చైతన్యానికి ప్రతీకగా ఆనాడు ఏదో ఒక వామపక్ష సంఘంలో పనిచేయడమే కేరాఫ్గా ఉండేది. ఇలాంటి సందర్భంలోనే ఎస్సీ/ఎస్టీ/బీసీ/మైనార్టీ వర్గాలకు చెందిన ఎందరో యువతీయువకులు అడవిబాటనే ఎంచుకున్నారు. గుంటూరు జిల్లా వాసి అంగడి చెన్నయ్య రాసిన"అన్నా అమరుడురా మన రామనర్సయ్య" అనే పాటకు నేటికీ మరణం లేకుండా గానం చేసిన వ్యక్తి అరుణోదయ నాగన్న. నాగన్న గానం చేసిన ఎన్నెన్నో పాటలు ప్రజల నాల్కలపై నేటికీ కూనిరాగాలై మెదులుతున్నాయి. "ఎక్కడున్నారో అన్నలు యాడవున్నారో" అనే పాటకు దాసోహమవ్వని తెలుగు పాటల ప్రియులు లేరు. సికాగో నగరాన చిందిన రకంలో తడిసిన ఎర్రగుడ్డ, అడవితల్లి తల్లడిల్లె అన్నా నినుదలచి ఎల్లన్న నిను తలచి, ఓ..అరుణాపతాకమా చేగొనుమా రెడ్ సెల్యూట్ అంటూ వందలాది విప్లవపాటలకు పాణం పోసి పాడిన ఘనత నాగన్నకే దక్కుతుంది. రాజ్యాహింసపైన పాడిన గొంతుపైన తుపాకి గొట్టం ఎక్కుపెట్టినా అలుపెరుగక పాటల ప్రవాహమై పోరు సంద్రానికి బాటలేసిన వారిలో నాగన్న ఒకరు. గోదావరి లోయ పోరాటాలను నువ్వు గొంతెత్తితే అంటూ రాసిన పాటకు జీవం పోసింది ఈ గొంతుకనే. నలభై ఏండ్ల కిందట ఖమ్మం జిల్లా వామపక్ష పార్టీలకు ఎర్రని ఖిల్లాగా ఉండేది. ఇదే జిల్లాలోని తిరుమలాయపాళెంలో, రాజారం గ్రామంలో గౌడ ఇంట జన్మించిండు నాగన్న. తండ్రి పాపయ్య కళాకారుడు కావడంతో కళను ఒంటబట్టించుకున్న నాగన్న పాడుతూనే ఎదిగి ప్రజల పాటగా అనేక సామాజిక ఉద్యమాల్లో భాగమైయ్యిండు. తెలుగు నేలపైన జరిగిన అనేకమైన ప్రజాపోరాటాల్లో పాటలవూటగా ప్రత్యక్షమయ్యిండు. కార్మిక ,కర్షక ,మహిళ చైతన్య వేదికల్లో నాయకుడిగా, గాయకుడిగా పనిచేసిన సందర్భాలు అనేకం. తెలంగాణోద్యమ సమయంలో పల్లె–పల్లెకు పాటలరూపంలో పయనించి నలభైయేండ్లకుపైగా ప్రజల పాటగా బ్రతుకుతున్న వ్యక్తికి కూడు, గూడు, ఆదరణ లేకపోవడమే ఇవ్వాల తెలుగు సమాజాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇల్లు లేని నాగన్న మణుగూరు, పిండిప్రోలు, బుగ్గ బంజర, తెట్టెపాడు, కూసుమంచి, వైరా వంటి గ్రామాల్లో సంచారజీవనమే సాగించిండని చెప్పుకోవాలి. ఎక్కడ గుడిసెలు వేసుకున్నా సరే రోడ్డు విస్తరణలో అవి ప్రభుత్వాలు కూల్చేయడం పరిపాటిగానే మారిపోయింది తప్ప శాశ్వత పరిష్కారం దొరకలేదు. ఇలా గత ప్రభుత్వం ఖమ్మం పట్టణంలో మమతా రోడ్డులో వేసుకున్న గుడిసెలు తీసివేసిన ఘటన అందరికీ సుపరిచితమే. క్రీడాకారులకు, సినిమా కళాకారులకు ఇచ్చే పారితోషికాలేవీ ప్రజాకళాకారులకు ఇవ్వకపోవడమే మన తెలుగు సమాజంలో ఉన్నటువంటి అతి పెద్ద లోటు. ప్రజల పాటగా అనేక ఉద్యమాలకు ఊపిరిగా బతికిన అనేకమంది కూడా చివరి దశలో సరైన వైద్య సదుపాయం లేకనే కనుమరుగైన సంఘటనలు అనేకమంది వాగ్గేయకారుల నిజజీవితంలో చూశాం. జీవితమంతా ప్రజల పక్షమే వహించిన నాగన్న ఇప్పుడు హాస్పిటల్లో ఉన్నడు. ఈ పాటకు దిక్కెవరు? ఈ గొంతు కూడా మూగపోవల్సిందేనా? పాటలను ఓన్ చేసుకున్న ప్రభుత్వాలు కావొచ్చు ప్రజలు కావచ్చు పాటగాడిని ఆదుకునేందుకు ఎందుకని ముందుకు రావడం లేదో ఆత్మావలోకనం చేసుకోవాల్సిన క్లిష్టమైన పరిస్థితి నేడు నాగన్న రూపాన మన ముందు ఉన్నది. కళాకారులను ప్రజల ఆస్తిగానే ప్రభుత్వాలు భావించినపుడు అనామకపు చావు ప్రజా పాటగాళ్లకు దాపురించదు. నాగన్న వంటి గొప్ప కళాకారుడిని కాపాడుకోవడం మనందరి బాధ్యత. ఇంతకంటే మరింత బాధ్యత తెలంగాణ ప్రభుత్వం తీసుకోవలసి ఉన్నది. నిలువ నీడలేని నాగన్నకు ప్రభుత్వమే తక్షణ సహాయం కింద ఒక ఇంటిని ఐదెకరాల వ్యవసాయ భూమిని మెరుగైన వైద్య సదుపాయాన్ని అందించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. అరుణోదయ నాగన్న ఇన్నాళ్లు ఆడిపాడిన పార్టీ సైతం ఎందుకు మౌనం వహిస్తున్నదో ఆత్మవిమర్శ చేసుకోవాలి. ప్రజల పాటకు శాశ్వత పరిష్కారముండాలి. సమాజంలో సముచిత స్థానం అంతకంటే ముందుండాలి. ప్రజాకళలు నిత్యం వర్ధిల్లాలి. ప్రజల గొంతుకలు నిత్యం వర్ధిల్లాలి. వీరగాథలను ఆలపించి ఇప్పుడు అనారోగ్యంతో కొట్టుమిట్టాడుతున్న అరుణోదయ నాగన్నను కాపాడుకోవడం మనందరి బాధ్యత.

# ఫిలిప్పైన్స్‌లో చైనా వ్యాక్సిన్లపై అమెరికా తప్పుడు ప్రచారం




బీజింగ్ : ఫిలిప్పైన్స్‌లో చైనా వ్యాక్సిన్లను అప్రతిష్టపాల్జేసేందుకు అమెరికా మిలటరీ రహస్యంగా తప్పుడు ప్రచారాన్ని ప్రారంభించిందని ఇటీవల రాయిటర్స్ దర్యాప్తులో వెల్లడైంది. ఈ చర్యను ప్రజారోగ్య నిపుణులు తీవ్రంగా ఖండించారు. అమెరికా మాజీ ఇంటెలిజెన్స్ అధికారులు కూడా దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా తన గుత్తాధిపత్యాన్ని కొనసాగించేందుకు ప్రయత్నిస్తోందని, చైనా అభివృద్ధిని తప్పుడు కథనాలు, వర్ణనలతో దెబ్బతీసేందుకు చూస్తోందని, ప్రజాభిప్రాయాన్ని తారుమారు చేస్తోందని, అంతులేని రీతిలో అసత్యాలు వ్యాప్తి చేస్తోందని పలువురు నిపుణులు విమర్శిస్తున్నారు.

చైనా వ్యాక్సిన్లను అప్రతిష్టపాల్జేసే ప్రచారానికి ఎలాంటి శాస్త్రీయ సాక్ష్యాధారాలు లేవని, కేవలం భౌగోళిక, రాజకీయ లక్ష్యాలు, వ్యూహాత్మక ప్రయోజనాలే వున్నాయని విమర్శించారు. కోవిడ్‌తో దారుణంగా దెబ్బతిన్న ఫిలిప్పైన్స్‌కు సాయమందించడానికి బీజింగ్ చేసిన యత్నాలను వాషింగ్టన్ కోవర్టు ఆపరేషన్ దెబ్బతీస్తోందని మనీలాకు చెందిన మేథో సంస్థ ఆసియన్ సెంచరీ ఫిలిప్పైన్స్ వ్యూహాత్మక అధ్యయనాల సంస్థ ఉపాధ్యక్షుడు అన్నా మలిండాగ్ విమర్శించారు. ఈ చర్యలు గణనీయమైన రీతిలో నైతిక, వ్యూహాత్మక ఆందోళనలు, ప్రశ్నలను లేవదీస్తున్నాయన్నారు. శాస్త్రీయ సాక్ష్యాధారాలతో మాట్లాడేందుకు బదులుగా భౌగోళిక, రాజకీయ లక్ష్యాల ఆధారంగా తప్పుడు ప్రచారాన్ని చేపట్టడం వల్ల కరోనా మహమ్మారిని సమిష్టిగా ఎదుర్కొనాల్న ప్రయత్నాలకు ఎదురుదెబ్బ తగలుతుందని అన్నారు. నిజానికి, ఇలాంటి నీచమైన ఎత్తుగడలకు పాల్పడుతూ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం అమెరికాకు ఇదే మొదటిసారి కాదు, 2019లో చైనా సోషల్ మీడియాను లక్ష్యంగా చేసుకుని ఆనాటి ట్రంప్ ప్రభుత్వం రహస్య ప్రచారాన్ని ప్రారంభించింది. చైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాలంటూ ప్రచారం చేసింది.

## కాంగ్రెస్, బీజేపీ మధ్య బొగ్గు గనుల పంచాయితీ



**హైదరాబాద్:** సింగరేణికి బొగ్గు గనులు కేటాయించకుండా వేలం వేలం వేసిన అంశంపై రాజకీయం ముదురుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. సింగేరేణికి ఉన్న గనులు త్వరలో అయపోతాయని ఆ తర్వాత గనులు లేకపోతే సంస్థ మనుగడ ఉండదని రాజకీయ పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. అయితే కేంద్రం మాత్రం సింగరేణి పరిధిలో ఉన్న బొగ్గు గనుల్ని కూడా వేలం వేస్తోంది. ఈ వేలం ప్రక్రియను హైదరాబాద్ లో నిర్వహించారు. బొగ్గు రంగంలో పారదర్శకత, పోటీతత్వం, స్థిరత్వాన్ని పెంపొందించడానికి సిద్ధంగా ఉన్నట్లు కేంద్రం తెలిపింది. ఈ కార్యక్రమానికి హాజరైన భట్టి విక్రమార్క సింగరేణి బొగ్గు గనుల అంశాన్ని ప్రస్తావించారు. బొగ్గు గనుల వేలం కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సింగరేణికి కొత్త గనులు కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరారు. గత ప్రభుత్వ పాలనలో కొయ్యగూడెం, సత్తుపల్లిలోని 6 కోల్ బ్లాకులను సింగరేణికి కేటాయిస్తే అనువుగా ఉంటుందని అన్నారు. ఈ విషయమై కిషన్ రెడ్డి ప్రధాని మోదీని ఒప్పించాలని భట్టి కోరారు. అవసరమైతే ప్రధానితో మాట్లాడేందుకు తాను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రావడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇక బొగ్గు గనుల వేలంలో సింగరేణికి రిజర్వేషన్ కల్పించాలని భట్టి కోరారు. ఈ అంశంపై కిషన్ రెడ్డికి భట్టి వినతి పత్రం కూడా సమర్పించారు. బొగ్గు గనుల వేలంతో రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా లబ్ధి చేకూరుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌లో సింగరేణి లాభం పొందేలా ఉత్పత్తిని ప్రారంభిస్తామన్నారు. త్వరలో ఒడిశా, తెలంగాణ ప్రభుత్వాలతో మాట్లాడుతామని చెప్పారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కోరిన అంశాలపై చర్చిస్తామన్నారు. సింగరేణి ఉద్యోగులు, కార్మికులకు నష్టం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. సింగరేణిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకొని వేలం చేపట్టినట్లు తెలిపారు. ఆదాయం కోసమే బొగ్గు గనులను వేలం వేయడం లేదని వివరణ ఇచ్చారు. సింగరేణి ఏరియా పరిధిలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకు ను వేలం వేస్తున్నారు. శ్రావణపల్లి బ్లాకులో 11.99 కోట్ల టన్నుల బొగ్గు నిక్షేపాలున్నట్టు గతంలో సింగరేణి నిర్వహించిన భూగర్భ సర్వేలో తేలింది. సింగరేణి ఏరియాలో ఉన్న ఈ బొగ్గు బ్లాకును వేలం వేయకుండా, నేరుగా సింగరేణికే కేటాయించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం డిమాండ్ చేసినా.. కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. కేంద్రం ఇంతకుముందు పలు దఫాలుగా సింగరేణి ఏరియాలోని కల్యాణఖని, శ్రావణపల్లి, కోయగూడెం, సత్తుపల్లి బొగ్గుబ్లాకులకు వేలం నిర్వహించింది. మొత్తం దక్షిణ భారతదేశానికే సింగరేణి బొగ్గు సరఫరా అవుతున్నది. థర్మల్ ప్లాంట్లతో కరెంటు ఉత్పత్తి అవుతున్నది.

## యోగా డే రోజున.. కేంద్రమంత్రికి చేదు అనుభవం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు చేదు అనుభవం ఎదురైంది. ఈ వేడుకలకు హాజరుకావడానికి వచ్చిన ఆయనకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తంకావడంతో వెనుదిరగాల్సి వచ్చింది. ఇంతకీ ఏం జరిగిందంటే..? యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. దిల్లీ యూనివర్సిటీలో ఈ కార్యక్రమాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ముందుండి నడిపించాల్సింది. అయితే ఆయన రాకను అక్కడి విద్యార్థులు తీవ్రంగా నిరసించారు. వారు నల్లజెండాలు ప్రదర్శించి ఆందోళన వ్యక్తంచేశారు. నీట్, యూజీసీ నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలను ప్రస్తావిస్తూ నినాదాలు చేశారు. దాంతో చేసేదేమీ లేక మంత్రి వెనక్కి వెళ్లిపోవాల్సి వచ్చింది. యూజీసీ నెట్ పరీక్షలో అవకతవకలు జరిగినట్టు ప్రాథమిక ఆధారాలు లభించడంతో కేంద్రం దానిని రద్దు చేసింది. మరోవైపు నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం కలకలం సృష్టిస్తోంది. ఈ పరిణామాల వేళ ప్రధాన్ స్పందిస్తూ.. నీట్ పరీక్షలో జరిగిన తప్పులు నిర్దిష్టమైన ప్రాంతాలకే పరిమితమని, ఉత్తీర్ణత సాధించిన లక్షలాది మందిపై ప్రభావం ఉండదని తెలిపారు.



# విద్యావ్యవస్థ భ్రష్టు పట్టింది...!



న్యూఢిల్లీ: దేశంలో విద్యావ్యవస్థను బీజేపీ, ఆర్ఎస్ఎస్ భ్రష్టు పట్టించాయని రాహుల్ గాంధీ మోడీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. విద్యాసంస్థలను ఆ రెండూ హైజాక్ చేశాయని అన్నారు. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గాంధీ పలు అంశాలను ప్రస్తావించారు. "భారత్ జోడో న్యారు యాత్ర సందర్భంగా.. దేశంలో నాన్‌స్టాప్ పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని చాలా మంది విద్యార్థులు ఫిర్యాదు చేశారు. మీ అందరికీ తెలిసినట్టుగా నీట్, యూజీసీ నెట్..2024 లీక్ అయ్యాయి. అందులో ఒకదాన్ని మాత్రమే కేంద్రం రద్దు చేసింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని మోడీ జీ ఆపారని చెబుతున్నారు. అది నిజమా కాదా అన్నది అలా ఉంచితే.. దేశంలో పేపర్ లీకేజీలను మాత్రం మోడీ ఆపలేకపోతున్నారు" అని రాహుల్ ఘాటుగా విమర్శించారు. పదేండ్ల మోడీ పాలనలో ఉపాధి కరువైంది. ఉద్యోగాల్లేవు. పోటీ పరీక్షలు ఇలా లీకులతో రద్దవుతుంటే.. ఓడిపోయేది విద్యార్థులేనని ఆందోళన వ్యక్తం చేశారు. నెలలు, ఏండ్లపాటు ప్రిపేరై పరీక్ష రాస్తే.. భావితరాల భవిష్యత్తుతో ఈ ప్రభుత్వం ఆడుకుంటోందని అన్నారు. "మధ్యప్రదేశ్‌లో వ్యాపం స్కాం జరిగింది. ఇపుడు దేశమంతా లీకులు విస్తరించాయి. విద్యాసంస్థల హైజాకింగ్ జరుగుతోంది. ఆర్ఎస్ఎస్ చేతుల్లో విద్యావ్యవస్థ బందీ అయ్యింది. విద్య కాషాయికరణను మోడీ జీ మరింత సులభతరం చేశారు. అవకతవకలపై విచారణ కొనసాగుతోంది. ఇపుడు ఒక పరీక్షను రద్దు చేశారు. మరొకటి రద్దు చేస్తారో లేదో తెలియదు" అని రాహుల్ గాంధీ అన్నారు. లీకులు, రద్దుకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతారా..? అని అడిగిన ప్రశ్నకు, "అవును, మేం దీన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తాం " అని గాంధీ చెప్పారు.

## పాకిస్థాన్‌లో ఖురాన్‌ను తగులబెట్టాడని ఒక వ్యక్తి హత్య



పవిత్రమైన ఖురాన్‌లోని కొన్ని పేజీలను తగులబెట్టాడనే కోపంతో కొంతమంది ఆకాతీయులు ఒక వ్యక్తిని హత్య చేశారు. ఈ ఘటన వాయువ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తునా?్వలో స్వాత్ జిల్లాలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఆ తర్వాత చెలరేగిన ఘర్షణలో ఎనిమిది మందికి పైగా గాయపడ్డారు. పోలీసులు పేర్కొన్న దాని ప్రకారం, సియాల్‌కోట్ జిల్లాకు చెందిన వ్యక్తి స్వాత్‌లోని మద్యన్ తహసీల్‌లో పవిత్ర ఖురాన్‌లోని కొన్ని పేజీలను తగులబెట్టాడని గొడవ జరగడంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని మద్యన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత కాసేపటికి పోలీస్ స్టేషన్ బయట గుమికూడిన గుంపు అతడిని తమకు అప్పగించాలని డిమాండ్ చేసింది. అందుకు పోలీసులు నిరాకరించడంతో వారు కాల్పులు జరపడం ప్రారంభించగా పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. ఈ ఎదురుకాల్పుల్లో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడగా అతన్ని మద్యన్ ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత గుంపు పోలీసు స్టేషన్‌కు నిప్పు పెట్టారు, అనంతరం కొందరు వ్యక్తులు పోలీస్ స్టేషన్‌లోకి ప్రవేశించి నిందితుడిని కాల్చి చంపి మృతదేహాన్ని మద్యన్ అడ్డాకు ఈడ్చుకెళ్లారని జిల్లా పోలీసు అధికారి జహీదుల్లా తెలిపారు. ఈ ఘటనతో అక్కడి ప్రాంతంలో తీవ్ర అలజడి నెలకొంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు మద్యన్‌లో భారీగా పోలీసులను మోహరించారు.

## ఎన్టీఏను రద్దు చేయాలి



న్యూఢిల్లీ: నీట్-యూజీ, యూజీసీ నెట్ పరీక్షల్లో అక్రమాలు జరిగిన నేపథ్యంలో బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. అవకతవకలపై దేశ వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు రోడ్డెక్కాయి.

ఢిల్లీ సహా వివిధ రాష్ట్రాల్లో ఆందోళన చేసిన విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం ప్రదర్శించారు. గురువారం నాడిక్కడ జేఎన్‌యూఎస్ యూతో పాటు, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డీఎస్ఎఫ్, టటవైఎస్, ఎన్ఎస్ యూఐ విద్యార్థి సంఘాలు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ (శాస్త్రి భవన్) కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగాయి. ఢిల్లీ పోలీసులు విద్యార్థులపై దాడికి దిగారు. విద్యార్థినులనూ మగ పోలీసులు కొట్టారు. అనంతరం విద్యార్థులను అరెస్టు చేసి ఢిల్లీలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసుల దౌర్జన్యాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. యూజీసీ నెట్, నీట్, సెంట్రల్ యూనివర్సిటీస్ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూసెట్) నిర్వహణలో పేపర్ లీక్‌లు, స్కామ్‌లతో సహా ఎన్టీఏ చుట్టూ ఉన్న వివాదాల నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు అర్హత లేని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిశ్వాస్ డిమాండ్ చేశారు.

## అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో బైడెన్‌కు మద్దతు ప్రకటించిన బిల్ గేట్స్ మాజీ భార్య



మైక్రోసాఫ్ట్ సహ-వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ మాజీ భార్య మెలిండా ఫ్రెంచ్ గేట్స్ నవంబర్‌లో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికలలో ప్రెసిడెంట్ జో బైడెన్‌కు మద్దతు ప్రకటించారు. ఆయన మహిళ సమస్యలను పరిష్కరించడంలో ముందు ఉంటారని మహిళలకు, కుటుంబాలకు ఉత్తమ అభ్యర్థి అని ఆమె అన్నారు. సోషల్ మీడియా ఎక్స్‌లో వ్యాఖ్యానించిన మెలిండా, నేను ఇంతకు ముందెన్నడూ అధ్యక్ష అభ్యర్థిని ఆమోదించలేదు. కానీ ఈ సంవత్సరం ఎన్నికలు మహిళలు, కుటుంబాలకు చాలా ముఖ్యమైనవి, ఈసారి నేను నిశ్శబ్దంగా ఉండలేను, బైడెన్‌కు మద్దతు ప్రకటిస్తున్నానని తెలిపారు.

## బలమైన ప్రతిపక్షం తప్పనిసరి!

బలమైన ప్రతిపక్షం తప్పనిసరిప్రజాస్వామ్యానికి పాలకపక్షం-ప్రతిపక్షం రెండూ రెండు కండ్లులాంటివి. కండ్లు సమంగా ఉంటేనే చూపు సరిగా ఉంటుంది. ప్రతిపక్షం ధీటుగా ఉంటేనే పాలకపక్షం సక్రమంగా వ్యవహరించగలు గుతుంది. కాబట్టి ప్రజాస్వామ్యం సజీవ ఆరోగ్య మనుగడకు బలమైన ప్రతిపక్షం తప్పనిసరి. స్వాతంత్ర్యోద్యమ కాలం నుండి కమ్యూనిస్టులు ఈ పనిచేసారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వానికి కమ్యూనిస్టులు అలా చెక్ పెట్టారు. ప్రతి అంశంలో చాలా పకడ్బందీగా, నిర్మాణాత్మకంగా వ్యవహరించడం వలనే నెహ్రూ ప్రభుత్వం కొంతలో కొంతైనా ప్రజానుకూలంగా వ్యవహరించడానికి అవకాశం ఏర్పడింది. సైద్ధాంతిక విభేదాలతో సాగే పాలక- ప్రతిపక్షం సభ్యుల చర్చల సరళి అటు పార్లమెంటులోనూ, ఇటు పార్ల మెంటు బయటా ఎంతో ఉపయుక్తంగా ఉండేది. ప్రజల రాజకీయ చైతన్యాన్ని విజ్ఞానదాయకంగా పెంచేది. పత్రికలు మీడియా హుందాగా నడిచేవి. నేతల ఉపన్యాసాల్లో రాతల్లో ఆ భాషా సంస్కారం, రాజకీయ పరిణితి, సైద్ధాంతిక పరిపక్వత, చమత్కారం ప్రస్ఫుటించేవి. అంతిమంగా అవి ప్రజాస్వామ్యం ఉద్దీపనగావడానికి ఎంతగానో తోడ్పడేవి. కానీ మనది భూస్వామ్య పెట్టుబడిదారీ పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రభుత్వం గనుక దాని పరిమితులు దానికి ఉంటాయి. అలాగే ఆ వర్గస్వభావమూ ఉంటుంది. ఆ దోపిడీ పీడన పాలనాంగాల్లో, చర్యల్లో అది వ్యక్తం అవుతూనే ఉంటుంది. వీర తెలంగాణా సాయుధ పోరాట కాలంలో నిజాం పోలీసులతో పాటు నెహ్రూ పటేల్ సైన్యం ఘాతుకాలకి వేలాదిమంది ప్రజానీకం బలికావడం తెలిసిందే. ఆ నిరుపేద ప్రజానీకం భయంకర నిర్బంధ చిత్రవధలకు గురవ్వడం. ప్రజానాయకులు అజ్ఞాతవాసాలకు వెళ్లడం. ప్రజల్ని క్రూరంగా పీడించిన దొరలూ దేశ్‌ముఖ్‌లే తిరిగి కాంగ్రెస్ నేతలుగా చెలామణిగావడం అందరూ ఎరిగిందే. ఈ నేపథ్యంలో ప్రపంచంలో తొట్టతొలిసారిగా ఎన్నికల ద్వారా ఎన్నికైన కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వానికి నాయకత్వం వహించిన ఘనత ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్‌దే. 1957లో సంభవించింది. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం ఉందని భారత ప్రజలకు చూపింది కమ్యూనిస్టులే. దున్నేవానికే భూమి చెందాలని భూ సంస్కరణలు ప్రవేశపెట్టడం. ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలపెంపు (సమాన పనికి సమానవేతనం) ఉపాధి కల్పనకై కొత్తగా ప్రయివేటు పెట్టుబడుల ఆకర్షణ, ప్రయివేటు పాఠశాలలో సైతం ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామకం మొదలైన చర్యలకు, ఆ ప్రభుత్వం శ్రీకారం చుట్టుంది. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు ఇవి ప్రత్యామ్నాయ విధానాలు. ఎక్కడ ఇవి ప్రజల్లో పాతుకు పోతాయేమోననే భయంతో 1959లో కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇ.ఎం.ఎస్. ప్రభుత్వాన్ని అక్రమంగా రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించడం అంటే రాష్ట్రాల హక్కులను అంటే ఆ రాష్ట్ర ప్రజల ప్రజాస్వామిక హక్కులను సామూహికంగా కాలరాయడమే. అలా ఇప్పటివరకు దాదాపు 125 సార్లు కేంద్రం, వివిధ రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించింది అంటే ఆ విధంగా ప్రతిపక్షాల నోళ్లు నొక్కేయడంగానే భావించాలి. ఈ పరిస్థితుల్లో ఇప్పటి 18వ లోక్‌సభ ఎన్నికల పరిశీలించినట్లయితే బీజేపీ-ఎన్డీయే కూటమి గెలిచి ఓడినట్టుగా ఫీలవుతుంటే, కాంగ్రెస్ -ఇండియా కూటమి ఓడి గెలిచినట్టుగా సంబరపడిపోతున్నది. ప్రజానీకం కూడా ఈ మార్పును అర్థం చేసుకోగలుగుతున్నది. తమకు ఎదురేలేదనుకున్న బీజేపీ అందునా ప్రధాని మోడీ దుర్మార్గాలకు, దురాగతాలకు కచ్చితంగా ముకుతాడు వేసి అడ్డగించగలమని ఉత్సాహపడ్తున్నది. 'ఈ ఎన్నికల్లో విపక్షాలు కొట్టిన చావుదెబ్బకు మోడీ సర్కార్ కనీసం నడవలేని స్థితికి చేరుకున్నదని' కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అంటున్నారు. భారత ఓటర్లు ప్రతిపక్షాలకు ఇచ్చిన ఆత్మస్థైర్యంగా దీనిని మనం చెప్పుకోవచ్చు. లోక్‌సభ మెజారిటీ మార్కు 272 కాగా బీజేపీకి 240 మాత్రమే వచ్చాయి. అందుకే తెలుగుదేశం (16 మంది ఎంపీలు) నితీష్ కుమార్ జనతాదళ్ (12 మంది ఎంపీలు)పై ఆధారపడవలసి వచ్చింది. కాంగ్రెస్‌కు 99 వచ్చినా ఇండియా కూటమికి 232 లభించాయి. ఎన్నికల కమిషన్ గణాంకాల ప్రకారం దాదాపు వందకోట్ల మంది భారత ఓటర్లలో 65 కోట్లమంది మాత్రమే ఓటు వేసారు. అంటే ప్రతి ముగ్గురులో ఇద్దరు మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులో 37శాతం మంది అంటే 23 కోట్ల మంది మాత్రమే బీజేపీకి ఓటువేసారు. ఇది మాత్రమే బీజేపీ ప్రాతినిధ్యం. మిగిలిన ప్రజాపక్షాన్ని ప్రతిపక్షంగా భావిస్తే ప్రతిపక్ష పాత్ర ఎంత విశాలమైనదో, ఎంత లోతైనదో, ఎంత పెద్ద బాధ్యతతో కూడుకున్నదో అవగతమవుతుంది. మరి దానికి తగిన విధంగా కాంగ్రెస్ వ్యవహరించగలదా? ప్రతిపక్షనేతగా రాహుల్ గాంధీ ఆ సమర్థతను చూపగలరా? అనేది వేచిచూడాలి. రాజ్యాంగ విలువలు లౌకిక విలువలు కాపాడడంతో పాటు ప్రజల్లో శాస్త్రీయతను, హేతువాద దృక్పథాన్ని పెంచవలసిన బాధ్యత ఎంతో ఉన్నది. హిందూత్వభావనకు వ్యతిరేకంగా సాఫ్ట్ హిందూత్వ అంటే కుదరదు. సైద్ధాం తికంగా నెహ్రూ శాస్త్రీయ దృక్పథానికి ఇది వ్యతిరేకం. ఓటు బ్యాంకు రాజకీయాలకు కక్కుర్తి పడటమే అవుతుంది. వ్రతం చెడ్డా ఫలితం దక్కదని రుజువవుతున్నది కూడా. మొత్తం విద్యావ్యవస్థనే కాషాయికరణ గావించడంలో గత బీజేపీ గణనీయ పాత్రను నిర్వహించింది. అలాగే రైతుల నల్లచట్టాలు మెడపై కత్తిలా వేలాడుతూనే ఉన్నాయి. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల చట్టాల సవరణ ప్రమాదం కొనసాగుతూనే ఉన్నది. వీటన్నిటిపై సుస్పష్ట వైఖరి అవశ్యం. దీనికి తోడు అవినీతి తారాస్థాయికి చేరింది. రూ. వందల వేలకోట్లు గల కుబేరులే ప్రజాప్రతి నిధులవుతున్నారు. పీడిత ప్రజల ప్రియతమనేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిస్టు పార్టీ పక్షనేతగా రాజ్యసభలో ప్రసంగించేటప్పుడు ప్రతి అంశం పూర్వాపరాలు తెలుసుకుని సాధికారంగా మాట్లాడేవారని ప్రతీతి.

# మెదడుకు ఇబ్బందులు కలిగించే అలవాట్లు.....



ఈ రోజుల్లో జ్ఞాపకశక్తికి సంబంధించిన సమస్యలు, మెదడు బలహీనపడటం, ఆందోళన, ఒత్తిడి, డిప్రెషన్, బైపోలార్ డిజార్డర్, అనేక ఇతర తీవ్రమైన మెదడు సంబంధిత సమస్యలు ప్రజలలో వేగంగా పెరుగుతున్నాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. దీని వెనుక చాలా కారణాలు ఉండవచ్చు. కానీ, మీరు పాటించే కొన్ని అలవాట్లు మీ మానసిక ఆరోగ్యాన్ని కూడా పాడు చేస్తాయి. ఈ రోజు మనం అలాంటి కొన్ని అలవాట్ల గురించి తెలుసుకుందాం. ఈ అలవాట్లు మనసు లోపల నుండి బలహీనంగా చేస్తాయి. ఈ అలవాట్లను మెరుగుపరచుకోవడం ద్వారా మీరు మీ మానసిక ఆరోగ్యాన్ని మంచిగా చూసుకోవచ్చు. కాబట్టి ఈ అలవాట్ల గురించి తెలుసుకుందాం. మీరు ఈ అలవాట్లను ఎలా మెరుగుపరచుకోవచ్చనే దాని గురించి కూడా ఈ కథనంలో తెలుసుకుందాం. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. శారీరక శ్రమ చేయకపోవడం మీ మానసిక సామర్థ్యాన్ని కూడా బలహీనపరుస్తుంది. ఇది మాత్రమే కాదు మీరు పెద్దవారిగా కనిపించవచ్చు. వ్యాయామం చేయడం ద్వారా ఈ క్షీణతను కొంత వరకు అరికట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల మీరు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకుంటే మీ దినచర్యలో వ్యాయామాన్ని చేర్చుకోండి. ఒక అధ్యయనం ప్రకారం.. మీ గుండెకు హాని కలిగించే విషయాలు మీ మెదడుకు కూడా హాని కలిగిస్తాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. తీపి, కొవ్వు అధికంగా తినడం మెదడుకు మంచిది కాదు. దీని వల్ల మెదడు కుంచించుకుపోయి జ్ఞాపకశక్తి బలహీనపడుతుంది. మీ ఆహారంలో స్వీట్లకు బదులుగా కూరగాయలు, తృణధాన్యాలు, చేపలు, ఆలివ్ నూనె మొదలైన వాటిని ఆహారంలో భాగం చేసుకోండి. అమెరికన్ మెడికల్ అసోసియేషన్ 2019 అధ్యయనం ప్రకారం.. ఎక్కువసేపు కూర్చోవడం కూడా జ్ఞాపకశక్తిని బలహీనపరుస్తుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. మీరు ప్రతి గంటకు ఐదు నిమిషాలు లేచి నడవడం వల్ల ప్రయోజనం పొందవచ్చు. ఒకవేళ మీరు రోజంతా కూర్చుంటే మధ్యలో ఒకసారి లేచి నడవండి. ఒంటరితనం వల్ల ఆలోచించే శక్తి తగ్గిపోయి మెదడు బలహీనంగా మారుతుంది. మరోవైపు బిజీగా ఉండటం కూడా జీవితంలో ఉద్దేశ్యం, అర్థాన్ని కనుగొనడంలో మీకు సహాయపడుతుంది. అంతే కాకుండా ఇతరులతో సంభాషించడం, ఆలోచనలు మార్చుకోవడం ద్వారా కూడా మనసు చురుకుగా ఉంటుంది.

## తిన్నది అరగడం లేదా?



వర్షాకాలం ప్రారంభమైనా చాలా చోట్ల ఇంకా మండే ఎండలు తగ్గడం లేదు. విపరీతమైన వేడిలో తిన్న ఆహారం కూడా సరిగా జీర్ణం కాదు. దీనికి తోడు డీహైడ్రేషన్ సమస్య కూడా వెంటాడుతుంది.అందుకే భోజనం చేసిన తర్వాత ఈ షర్బత్ తీసుకుంటే జీర్ణక్రియ సక్రమంగా జరుగుతుంది. శరీరం కూడా తాజాగా ఉంటుంది. కీర దోస జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తుందని అందరికీ తెలుసు. అందుకే చాలా మంది కీర దోస భోజనంతో పాటు తీసుకుంటారు. లేదంటే భోజనం తర్వాత అయినా సలాడ్‌గా తింటారు. ఈ కీర దోసతో బాడీ కూలింగ్ షర్బత్‌ను తయారు చేసుకుంటే జీర్ణసమస్యలు ఇట్టే మాయం అవుతాయి. కీర దోస షెర్బత్ చేయడానికి.. తరిగిన కీర దోస ముక్కలు, నిమ్మకాయ, నీరు, రుచికి చక్కెర, కొద్దిగా అల్లం, కాస్తింత ఉప్పు తీసుకోవాలి.

కీర దోస పరిమాణం కొంచెం ఎక్కువగా ఉంటే మంచిది. ఉదాహరణకు 250 మిల్లీలీటర్ల నీటికి కనీసం 2 మీడియం సైజు కీర దోస తీసుకోవాలి. ముందుగా కీర దోస బాగా కడిగి, తొక్క తీసి చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. కీర దోస పొట్టు లేకుండా చూసుకోవాలి. నిమ్మకాయ తొక్కను కూడా తీసెయ్యాలి. ఇప్పుడు నీళ్ళు, కీర దోస, నిమ్మకాయలను కలిపి బ్లెండర్‌లో వేసి బాగా కలపాలి. ఇందులో అల్లం, కాస్తింత ఉప్పు, చక్కెరను కూడా వేసుకోవాలి. కలిపిన మిశ్రమాన్ని వడకట్టి ఫ్రిజ్‌లో ఉంచాలి. కాస్త చల్లగా మారిన తర్వాత గ్లాసులో పోసి ఐస్ క్యూబ్స్ తో గార్నిష్ చేసి సర్వ్ చేసుకుంటే రెడీ అయిపోయినట్లే. ఇది రుచిగా ఉండటంతోపాటు జీర్ణక్రియకు కూడా మేలు చేస్తుంది. పైగా శరీరంలో నీటి సమతుల్యతను కూడా నిర్వహిస్తుంది.

## నిత్యం యవ్వనంగా కనిపించాలనుకుంటున్నారా..?




మన శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించే ముఖ్యమైన ధాన్యాలలో రాగులు ఒకటి. మిల్లెట్లను వివిధ మార్గాల్లో, పలు ఆహార పదార్థాలలో వినియోగిస్తారు. రాగిపిండితో ఎన్నో ప్రయోజనాలున్నాయి...

రాగి ముద్ద, రాగి రోటీ, రాగి గంజి, రాగి అంబలి ఇలా పలు రకాలుగా తయారు చేసుకోని తీసుకుంటారు. మిల్లెట్‌లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. రాగులు పిల్లల సరైన అభివృద్ధికి కూడా ఉపయోగపడుతాయి.. వృద్ధులు, మహిళలు ఎముకల బలానికి మిల్లెట్ మాల్ట్ ను క్రమం తప్పకుండా తీసుకోవాలి.

రాగి గంజి తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం.. మిల్లెట్ మాల్ట్ ఎముకల బలానికి మినరల్స్ ఏర్పడటానికి బాగా దోహదపడుతుంది. రాగి మాల్ట్ తాగితే మన శరీరానికి శక్తి వస్తుంది. రాగుల్లోని పోషకాలు ముఖ్యంగా ప్రొటీన్లు, విటమిన్లు ఎ, బి, సి, మినరల్స్ మన శరీరానికి బలాన్ని ఇస్తాయి. దీంతో జీర్ణశక్తి పెరుగుతుంది. రాగుల్లో ఉండే అమైనో ఆమ్లాలు ట్రిప్టోఫాన్, ఇది ఆకలిని తగ్గిస్తుంది. దీని వినియోగం బరువును అదుపులో ఉంచుతుంది. మిల్లెట్ పిండితో చేసిన ఆహారాన్ని తినడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. రాగులు గుండె బలహీనత, ఉబ్బసాన్ని తగ్గిస్తాయి. రాగులతో చేసిన ఆహారాన్ని తినడం వల్ల వృద్ధాప్యంలో శరీరానికి బలం చేకూరుతుంది. మిల్లెట్ ఫుడ్ ను రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల శరీరానికి మంచి శక్తి లభిస్తుంది. రాగులను తీసుకోవడం వల్ల చర్మం మెరుస్తూ, మృదువుగా మారుతుంది.. దీంతో ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపిస్తారు.

రాగుల్లో ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల రక్తహీనత సమస్య నుంచి బయటపడవచ్చు. గంజి, పాలతో కలిపిన మిల్లెట్ మధుమేహానికి మంచి ఔషధంగా పనిచేస్తుంది. క్రమం తప్పకుండా తీసుకుంటే.. రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్ ఉంచవచ్చు.. మిల్లెట్ ఫైటోకెమికల్స్ జీర్ణ ప్రక్రియను నెమ్మదిస్తాయి. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. అధిక రక్తపోటు, ఇతర కరోనరీ వ్యాధులతో బాధపడేవారికి ఫైబర్ అధికంగా అందుతుంది..

## అల్యూమినియం పాత్రల్లో వంట చేస్తున్నారా?



ఒకప్పుడు కేవలం మట్టి పాత్రల్లో మాత్రమే వంట చేసుకొని తినే వారు. ఇప్పుడు రకరకాల వస్తువులు పెరిగిపోయాయి. దీంతో ఎలాంటి వాటిలో వండకూడదో అలాంటి పాత్రల్లోనే వండుతున్నారు.స్టైల్ గా వంటిల్లు కనిపించాలని కూడా చాలా వస్తువులను తీసుకొని వస్తున్నారు. ఇలాంటి వాటితో ముప్పు పెరుగుతుంది అంటున్నారు నిపుణులు. అయితే మీరు అల్యూమినియం పాత్రల్లో వంట చేస్తున్నారా?అల్యూమినియం పాత్రల్లో వంట చేసుకొని తినే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే వీటి ధర కాస్త తక్కువ ఉండటం. ఎక్కువ అందుబాటులో ఉండటంతో వీటిని కొనుగోలు చేసే వారి సంఖ్య పెరుగుతుంది. కానీ వీటిలో వంట చేయకూడదు అంటున్నారు నిపుణులు. ఈ పాత్రలను ముందుగా ఆంగ్లేయులు పరిచయం చేశారాట. ఇక దీన్ని సీమండి సీమండి అంటారు ప్రజలు. అంటే సీమ వెండి అని అర్థం. కేవలం వెండి రంగులో ఉండే ఫారిన్ పాత్రలు అని అర్థం. అంటే ఇవి వెండి పాత్రలు కావు. అల్యూమినియం పాత్రల్లో వంట చేయడం నేర్పింది కేవలం ఆంగ్లేయులు అంటారు నిపుణులు. ఇందులో వంటలు చేసుకొని తినడం వల్ల శరీరంలో ఉండే పూర్తి శక్తి నశిస్తుందట. అందుకే మట్టి పాత్రలను ఉపయోగించాలి అంటున్నారు నిపుణులు. మంటి పాత్రల వాడకం పెరిగితే చాలా ప్రయోజనాలు కూడా ఉంటాయట. అయితే మీరు ఒక విషయం గమనిస్తే చాలా మంది శ్రామికులు బలంగా ఉంటారు. వీరి ఇప్పటికి కూడా మట్టి పాత్రల్లోనే వంట చేస్తుంటారు.

## నిద్ర వల్ల అనారోగ్య సమస్యలు దూరం...!



నిద్ర ప్రతి ఒక్కరికి చాలా అవసరం. నిద్ర వల్లనే ఎన్నో అనారోగ్య సమస్యల నుంచి దూరం అవవచ్చు. సరైన నిద్ర ఉంటే ఆరోగ్యం బాగుంటుంది. లేదంటే ఎన్నో సమస్యల వల్ల పోరాడాల్సిందే.ప్రస్తుతం బిజీ లైఫ్ వల్ల చాలా మంది సరైన నిద్ర పోవడం లేదు. ముఖ్యంగా యువత నిద్రలేమి సమస్యలతో బాధ పడుతున్నారు. ఇక ఉద్యోగాలు చేసేవారు కూడా దీనికి ఇబ్బంది పడుతున్నారు. షిఫ్టులు ఉన్నవారు రాత్రి పది గంటల వరకు కూడా ఆఫీస్ లలోనే ఉంటారు. ఇలాంటి వారికి చాలా సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు చాలా మంది ఫోన్ లోనే తల పెడుతున్నారు. ఫోన్ చూస్తూనే నిద్ర పోయే వారి సంఖ్య చాలా పెరుగుతుంది కూడా. రేడియేషన్ అని తెలిసి కూడా ఫోన్ ను దూరం పెట్టడం లేదు. దీని వల్ల రాత్రి 12 గం.ల అయినా సరే నిద్ర పోవడం లేదు.

రాత్రి 10 గం. లకు పడుకొని ఉదయం 5 గం.కు లేస్తే ఆరోగ్యం చాలా బాగుంటుంది అంటారు నిపుణులు. ఉదయం నిద్ర లేచే వారు సక్సెస్ అవుతారని చాలా అధ్యయనాలు చెబుతున్నాయి. కానీ 8,9 అవుతున్నా నిద్ర లేవని వారి సంఖ్య కూడా పెరుగుతుంది. సరైన నిద్ర ఉంటే జ్ఞాపక శక్తి బాగుంటుందట. నేటి యువత చాలా తక్కువ సమయం పడుకుంటున్నారు. అందుకే వారి జ్ఞాపకశక్తి మెరుగ్గా ఉండటం లేదు అంటున్నారు నిపుణులు. అయితే ఎనిమిది గంటలు కచ్చితంగా పడుకోవాలి. దీని కోసం మధ్యాహ్నం గంట సేపు పడుకున్నా సరిపోతుంది. రాత్రి 7 గంటలు నిద్ర పోవాలి. కానీ కొందరికి మధ్యాహ్నం నిద్ర పోవడం కుదరదు.

అలాంటి వారు కచ్చితంగా రాత్రి ఎనిమిది గంటలు నిద్ర పోవాల్సిందే. ఒకపూట అన్నం మానేసినా పర్వాలేదు కానీ నిద్ర మాత్రం మానేయకూడదు అంటున్నారు నిపుణులు. మరి మీరు ఎన్ని గంటలు నిద్ర పోతున్నారు అనేది మీరు కచ్చితంగా ఆలోచించాలి. రాత్రి ఎనిమిది గంటలు లేదా ఏడు గంటలు పడుకొని మధ్యాహ్నం ఒక గంట అయినా పడుకోవాల్సిందే.

## ఆరోగ్యంగా ఉండాలంటే ఈ ఒక్కటి చాలు...!




ప్రస్తుతం ప్రతి ఒక్కరు ఏదో ఒక అనారోగ్య సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. కొందరు మధుమేహం మరికొందరు థైరాయిడ్, క్యాన్సర్, టీబీ ఇలా చెప్పుకుంటూ పోతే సాధారణ వ్యాధుల నుంచి మొదలు పెడితే అసాధారణ వ్యాధులు కూడా వెంటాడుతున్నాయి.అనారోగ్యకరమైన ఆహారం, వాతావరణంలో మార్పులు, బిజీ లైఫ్ వంటివి వ్యాధులకు కారణం అవుతున్నాయి. అందుకే కొన్ని ఆహార నియమాలను పాటించాలి. లేదంటే మీ చేతులారా మీ ఆరోగ్యాన్ని మీరు పాడు చేసుకున్న వారు అవుతారు.

ఫ్రైడ్ రైస్, సఇప్పుడున్న బీజీ షెడ్యూల్స్ కు చాలా మంది వంటకు ప్రాధాన్యం ఇవ్వకుండా బయట ఆహారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. వంట చేసే సమయం లేదని బయట కర్రీలు, బిర్యానీలను ఆర్డర్ పెట్టుకొని మరీ తింటున్నారు. మోసా, నూడిల్స్ అంటూ ఏదో ఒకటి తిని ఆకలిని చంపేస్తున్నారు. ఇలా చేయడం వల్ల చాలా అనారోగ్య సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. అందుకే పూర్తిగా బయట ఆహారం మానేయాల్సిందే. లేదంటే మీరు చాలా వ్యాధుల బారిన పడతారు. ఈ కాలం యువతకు బయట ఫుడ్ అంటే ఫ్యాషన్ అన్నట్టుగా బిహేవ్ చేస్తున్నారు. అయితే తల్లి వంట వండినా సరే బయట తినాలి అని కోరుకుంటున్నారు.

## ఇంట్లో చెప్పులు లేకుండా నడుస్తున్నారా......?

ఇంట్లో చెప్పులు లేకుండా నడవడం సర్వసాధారణం. పాదరక్షలు లేకుండా నడవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని చిన్నప్పటి నుంచి చెబుతూనే ఉంటారు. ఇది శరీరానికి మేలు చేస్తుందని సైన్స్ కూడా భావిస్తుంది. చెప్పులు లేకుండా నడవడం వల్ల శరీరంలో యాంటీ ఆక్సిడెంట్లు పెరిగి వాపులు తగ్గుతాయి.

అంతేకాదు నిద్రను మెరుగుపరుస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఉదయాన్నే గడ్డి మైదానంలో చెప్పులు లేకుండా నడవడం చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. అయితే ఇంట్లో చెప్పులు లేకుండా నడవడం వల్ల చాలా నష్టాలు ఉన్నాయని ఓ పరిశోధనలో వెల్లడైంది. ఇంట్లో చెప్పులు లేకుండా నడవడం వల్ల కలిగే దుష్ప్రభావాలు ఏమిటో ఇక్కడ తెలుసుకోండి. ఇంట్లో పాదరక్షలు లేకుండా నడుస్తుంటే గాయమవుతుందనే భయం ఉంటుంది. దీని వల్ల పాదాలు దెబ్బతింటాయి. చెప్పులు ధరించడం వల్ల గాయం ప్రమాదం తగ్గుతుంది. కాబట్టి ఇంట్లో చెప్పులు లేకుండా నడవకూడదు.



గట్టి ఉపరితలాలపై చెప్పులు లేకుండా నడవడం వల్ల శరీరంలోని మిగిలిన భాగాలపై ఒత్తిడి పెరుగుతుంది. దీని వల్ల వెన్నునొప్పి, కాలు నొప్పి లేదా మోకాళ్ల నొప్పులు పెరగవచ్చు. అందువల్ల,ఇంట్లో ఎక్కువసేపు చెప్పులు లేకుండా నడవడం మానుకోవాలి. ఇంట్లో చెప్పులు లేకుండా నడవడం వల్ల పాదాలకు తీవ్రమైన సమస్యలు వస్తాయి. ఇది మడమలో నొప్పిని పెంచుతుంది. ఇది భవిష్యత్తులో తీవ్రంగా మారుతుంది.



# అరియానా నడుము అందాలు




# సందీప్ కిషన్‌కు జోడిగా రీతు వర్మ.?

టాలీవుడ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా ప్రాజెక్ట్ ఏస్‌కే30. ఈ సినిమాకు ధమకాతో బ్లాక్ బస్టర్‌ను అందుకున్న త్రినాధ రావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం రీసెంట్‌గా షూటింగ్ ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాలో కథానాయికకు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ వచ్చింది. ఈ చిత్రంలో సందీప్‌కు జోడిగా పెళ్లి చూపులు భామ రీతు వర్మ నటించబోతున్నట్లు తెలుస్తుంది. ముందుగా ఈ చిత్రం కోసం కొత్త అమ్మాయిని అనుకున్న చివరికి రీతు వర్మకి ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్లపై వస్తున్న సినిమా ఇది. పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని రాజేష్ దండా నిర్మిస్తుండగా, బాలాజీ గుత్తా సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ఏకే ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై అనీల్ సుంకర సమర్పిస్తున్నారు. ధమాకా తర్వాత రచయిత ప్రసన్న కుమార్ బెజవాడ.. ఈ సినిమాకు కూడా కథ, స్క్రీన్‌ప్లే డైలాగ్స్ అందిస్తున్నాడు. సందీప్ కిషన్ క్యారెక్టరైజేషన్ గత చిత్రాల కంటే డిఫరెంట్ గా ఉంటుంది. రావు రమేష్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకు లియోన్ జేమ్స్ సంగీత దర్శకుడు.

### ఓటీటీలోకి వచ్చేసిన అమీర్ ఖాన్ కొడుకు వివాదాస్పద చిత్రం

# 'మహారాజ్'




బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్ట్ అమీర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం మహారాజ్. ఈ సినిమాకు సిద్దార్థ్ పి మల్హోత్రా దర్శకత్వం వహించగా.. బాలీవుడ్‌లోని ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ 'యష్ రాజ్ ఫిల్మ్స్' బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మించారు. అయితే జునైద్ ఖాన్ తొలి చిత్రం 'మహారాజ్' విడుదలకు ముందే చిక్కుల్లో పడిన విషయం తెలిసిందే. జూన్ 14న ఈ మూవీని నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్రకటించారు. కానీ ఈ సినిమా హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందంటూ హిందు సంఘాలు కోర్టులో కేసు వేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు తీసుకున్న గుజరాత్ హైకోర్ట్ ఈ చిత్ర నిర్మాణ సంస్థకు షాకిచ్చింది. ఈ చిత్రాన్ని విడుదల చేయకూడదంటూ తాజాగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ సినిమా విడుదల వాయిదా పడింది. అయితే తాజాగా 'మహారాజ్' సినిమాను విడుదల చేయవచ్చని గుజరాత్ హైకోర్టు ఆదేశించింది. దీంతో ఈ మూవీ ట్రైలర్‌తో పాటు మూవీని నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల చేశారు మేకర్స్. ఇక ఈ సినిమా కథ విషయానికి వస్తే.. భారతదేశంలోని అత్యంత ముఖ్యమైన న్యాయ పోరాటాలలో ఒకటిగా పరిగణించబడే 1862 మహారాజ్ లిబెల్ కేసు ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. 1862లో మతాన్ని అడ్డుపెట్టుకుని స్వామీజీలు ఎలాంటి క్రూరమైన పనులు చేశారు. భక్తి ముసుగులో అమ్మాయిలను బలత్కారం చేయడం లాంటి ఆధారంగా ఈ సినిమా వచ్చింది. ఇక ఇందులో జునైద్ ఖాన్ సంఘ సంస్కర్త కర్సందాస్ ముల్జీ పాత్రను పోషిస్తుండగా.. స్వామీజీ పాత్రలో జైదీప్ అహ్లావత్ నటించారు.

## సన్నీ లియోన్ వలన పేరు మార్చుకున్న అడివిశేష్.. ఎందుకంటే.?

టాలీవుడ్‌లో ఉన్న యంగ్ డైనమిక్ హీరోల్లో అడివిశేష్ ఒకడు. ఎటువంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఫిలిం ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి క్షణం, గూడఛారి, మేజర్, హిట్ 2 వంటి సినిమాలతో తనకంటూ సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు. ఈ క్రేజీ హీరో నుంచి ప్రస్తుతం డెకాయిట్‌తో పాటు గూఢచారి 2 సినిమాలు వస్తున్నాయి. అయితే అడివిశేష్‌కు సంబంధించిన అసలు పేరు గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. అడివి శేష్ అసలు పేరు సన్నీ చంద్ర. శేష్ ఇండియాలో పుట్టిన అమెరికాలో పెరిగాడు. అయితే అమెరికాలో ఉన్నప్పుడు అతడి పేరు సన్నీ చంద్ర. అదే సమయంలో పోర్న్ స్టార్ సన్నీ లియోని అక్కడ బాగా ఫేమస్. అలాగే సన్నీ పేరు మీదా సన్నీ డెలైట్ అంటూ ఐస్ క్రీమ్ కూడా ఉండేది అంట.. దీంతో అందరూ శేష్‌ను సన్నీ, సన్నీ అంటూ పిలిచి ఏడిపించేవారని వారి టార్చర్ భరించలేక.. శేష్‌గా పేరు మార్చుకున్నట్లు అడివి శేష్ తెలిపాడు. అమెరికాలో నేను చదువుకునేటప్పుడు నను సన్నీ లియోన్.. సన్నీ లియోన్ అని ఏడిపించేవారు. ఆ టార్చర్ తట్టుకోలేక ఒకసారి నాన్న దగ్గరకు వెళ్లి నేను పేరు మార్చుకుంటాను.. నా ఫ్రెండ్స్ అందరూ నన్ను ఏడిపిస్తున్నారు అని చెప్పాను. అయితే శేష్ అని పెట్టుకో అన్నారు. తనకు నచ్చిన క్రికెటర్ సునీల్ గవాస్కర్ పేరుమీద సన్నీ అని పెట్టానని, పంతులుగారు.. శ అనే అక్షరంతో పేరు ఉండాలని చెప్పారు. అందుకే శేష్ అని పెట్టుకో అని అన్నారు. అప్పటినుంచి నా పేరు అడివి శేష్ గా మారిందని శేష్ ఒక ఇంటర్వ్యూలో చెప్పుకోచ్చాడు.

# ధోని ఎడిషన్ కారును లాంచ్ చేసిన సిట్రోయిన్....!




సిట్రోయిన్ కార్లకు మన దేశంలో మంచి డిమాండే ఉంటుంది. కారు లుక్, డిజైన్, పనితీరుకు ఫిదా అవ్వాల్సిందే. కాగా ఇప్పుడు ఈ కంపెనీ నుంచి మరో కొత్త మోడల్ కారును భారతీయ మార్కెట్లోకి విడుదల చేసింది సిట్రోయిన్ ఇండియా. సిట్రోయిన్ సీ3 ఎయిర్‌క్రాస్ ధోని ఎడిషన్‌ను లాంచ్ చేసింది. దీని ధర రూ. 11.82 లక్షలు ఎక్స్-షోరూమ్. ఈ పరిమిత కాల ఎడిషన్లో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. ధోనీ డీకాల్స్, కస్టమ్ యాక్సెసరీలు, డిజైన్ అంశాలు ఉన్నాయి. ఇల్యూమినేటెడ్ సిల్ ప్లేట్లు, ఫ్రంట్ డాష్ క్యామ్, స్పెషల్ ఎడిషన్ సీట్ మరియు బెల్ట్ కవర్లను కూడా పొందుతుంది. కస్టమర్లందరికీ ధోని ఉపకరణాలను గెలుచుకునే అవకాశం ఉంది. అలాగే మొదటి 100 యూనిట్లలో ఒకదానిలో మహేంద్ర సింగ్ ధోని సంతకం చేసిన గ్లోవన్ను గెలుచుకునే అవకాశం లభిస్తుంది. సిట్రోయిన్ సీ3 ఎయిర్ క్రాస్ ధోని ఎడిషన్‌లో కొన్ని కాస్మెటిక్ మార్పులు మాత్రమే కంపెనీ చేసింది. అలాగే కొన్ని ఉపకరణాలను జోడించింది. ఈ ఎస్‌యూవీకి ఎలాంటి మెకానికల్ మార్పులు లేవు. సిట్రోయిన్ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ శిశిర్ మిశ్రా ఈ లాంచ్ గురించి మాట్లాడుతూ సీ3 ఎయిర్ క్రాస్ ప్రత్యేకమైన 'ధోనీ ఎడిషన్'ని 100 యూనిట్ల పరిమిత రన్లో మాత్రమే ఆవిష్కరిస్తున్నట్లు చెప్పారు. తమ బ్రాండ్ అంబాసిడర్ ధోని స్థితిస్థాపకత, నాయకత్వం, శ్రేష్ఠత-అత్యుత్తమ అనుభవాలను అందించడంలో సిట్రోయెన్ అంకితభావంతో పనిచేస్తుందన్నారు. ఈ అరుదైన, పరిమిత ఎడిషన్ ధోని లెజెండరీ జర్నీకి అపూర్వమైన గుర్తింపుగా, ఆటోమోటివ్ చరిత్రలో ఒక భాగాన్ని సొంతం చేసుకునేందుకు అభిమానులకు అసమానమైన అవకాశాన్ని అందిస్తుందని చెప్పారు. ఈ అసాధారణ సహకారాన్ని అనుభవించే కొద్దిమందిలో ఒకరిగా ఉండే అవకాశాన్ని కోల్పోకండని పిలుపునిచ్చారు.

# ఖాతాదారులకు ఆ బ్యాంకు హెచ్చరిక..!




ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరికీ బ్యాంకు అకౌంట్ అనేది తప్పనిసరి అవసరంగా మారింది. భారతదేశంలో డిజిటల్ పేమెంట్స్ వృద్ధికి బ్యాంకు అకౌంట్లే కారణమని నిపుణులు చెబుతూ ఉంటారు.

అయితే ఏదో ఓ అవసరంతో కొన్ని బ్యాంకుల్లో ఖాతాలు తీసుకుని అవసరం తీరిపోయాక ఖాతాను వాడని వాళ్లు చాలా మంది ఉంటారు. అయితే ఇలాంటి ప్రముఖ బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ షాకింగ్ వార్త చెప్పింది. వినియోగంలో లేని ఖాతాలు ఈ నెలాఖరులోపు కేవైసీ ప్రక్రియ పూర్తి చేయకపోతే జూన్ 30వ తేదీన ఖాతాలన్నీ క్లోజ్ చేస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో మీకు పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఖాతా ఉ ంటే ఆ ఖాతా క్లోజ్ అవ్వకుండా ఉండేందుకు కేవైసీ ప్రక్రియ ఎలా చేపట్టాలో? ఓసారి తెలుసుకుందాం. మీకు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో సేవింగ్స్ ఖాతా ఉంటే ముందుగా దాని స్థితిని తనిఖీ చేయాలి. ఇలాంటి ఖాతాలను ఈ నెలాఖరులోగా పీఎన్‌బీ మూసివేయనుంది. గత 3 సంవత్సరాలుగా ఎలాంటి లావాదేవీలు జరగని ఖాతాలపై బ్యాంక్ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. అలాగే గత మూడేళ్లుగా ఖాతా బ్యాలెన్స్ జీరో ఉన్న వారి ఖాతాలను కూడా బ్యాంకు మూసేనుంది. అలాంటి వినియోగదారులకు ఇప్పటికే బ్యాంకు నోటీసులు పంపింది. నోటీసు పంపిన ఒక నెల తర్వాత ఆ ఖాతాలు మూసివేస్తారు. మీరు ఆ ఖాతాలను యాక్టివ్‌గా ఉంచుకోవాలనుకుంటే, వెంటనే బ్యాంక్ బ్రాంచ్‌కి వెళ్లి కేవైసీని పూర్తి చేయాలి.

చాలా మంది స్కామర్‌లు చాలా కాలంగా కస్టమర్‌లు ఉ పయోగించని ఖాతాలను దుర్వినియోగం చేస్తున్నారు. ఇలాంటి కేసులను ఎదుర్కోవడానికి బ్యాంక్ ఈ పెద్ద అడుగు వేసింది. బ్యాంక్ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఏప్రిల్ 30, 2024 నాటికి ఏయే ఖాతాలు ఇన్‌యాక్టివ్ ఉన్నాయో? గుర్తించింది. ఆ మేరకు వారికి నోటిసులు పంపి జూన్ 30నాటికి ఖాతాలను క్లోజ్ చేయనున్నారు.

బ్యాంక్ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, ఖాతా నిష్క్రియంగా మారితే, ఖాతాదారుడు ఖాతాను తిరిగి యాక్టివేట్ చేయాలనుకుంటే అటువంటి ఖాతాదారులు సంబంధిత శాఖకు వెళ్లి కేవైసీ ఫారమ్‌ను పూరించాలి. కేవైసీ ఫారమ్‌తో పాటు కస్టమర్ అవసరమైన పత్రాలను కూడా జతచేయాలి. దీని తర్వాత వారి ఖాతా యాక్టివేట్ అవుతుంది. కస్టమర్లు మరింత సమాచారం కోసం బ్యాంకుకు వెళ్లవచ్చు. పంజాబ్ నేషనల్ బ్యాంకు డీమ్యాట్ ఖాతాలను మూసివేయదు.

# 45 రోజుల వ్యాలిడిటీతో ఎయిర్‌టెల్ రీఛార్జ్ ప్లాన్...!




వినియోగదారులను మరింతగా ఆకట్టుకునేందుకు టెలికాం కంపెనీలు సరికొత్త ఎత్తుగడలు వేస్తున్నాయి. రకరకాల రీఛార్జ్ ప్లాన్స్‌ను ప్రవేశపెడుతూ కస్టమర్లను ఆకట్టుకుంటున్నాయి. ఇక ఎయిర్‌టెల్ కూడా మార్కెట్లో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. ఎయిర్‌టెల్ తన ప్రీపెయిడ్ యూజర్ల కోసం కొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌ను తీసుకువచ్చింది. రూ.279 విలువ గల ప్రీపెయిడ్ ప్లాన్‌పై వ్యాలిడిటీతోపాటు అపరిమిత కాల్స్ సదుపాయం కల్పిస్తోంది. దీని వ్యాలిడిటీ 45 రోజుల వరకూ ఉంటుంది. ఈ ప్లాన్ సాధారణంగా 28 లేదా 30 రోజుల వరకూ మాత్రమే ఉంటుంది. కానీ తాజా కొత్త ప్రీ పెయిడ్ ప్లాన్ కింద మరో 15 రోజుల పాటు వ్యాలిడిటీని పెంచుతూ నిర్ణయం తీసుకుంది ఎయిర్‌టెల్. ఈ ప్లాన్‌లో అన్ లిమిటెడ్ వాయిస్ కాలింగ్, లోకల్, ఎస్టీడీ తదితర వసతులు లభిస్తాయి. అలాగే 6జీబీ డేటాతో 70 రోజుల వ్యాలిడిటీతో రూ.395 ప్లాన్, రూ.455తో 84 రోజుల వ్యాలిడిటీ ప్రీ పెయిడ్ ప్లాన్ ప్రకటించింది. రూ.279 ప్లాన్ కింద మొత్తం 2జీబీ డేటా లభిస్తుంది. డేటా పూర్తయిన తర్వాత ఒక్కో ఎంబీపీఎస్ డేటాకు 50 పైసల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఈ వ్యాలిడిటీలో 600 ఎస్సెమ్మెస్‌లు పొందవచ్చు. అటుపై ఒక్కో మెసేజ్‌కి రూపాయి చార్జి విధిస్తుంది. వీటితోపాటు అపోలో 24/7 సర్కిల్, ఉచిత హలో ట్యూన్‌లు, వింక్ మ్యూజిక్ తదితర అదనపు బెనిఫిట్స్ కూడా ఉంటాయి. డేటా వాడకుండా కేవలం వ్యాలిడిటీ కోసం వాడే వారికి ఈ ప్లాన్ సరిపోతుంది.


# భారత్‌లో కవాసకీ న్యూ బైక్ లాంచ్....!




భారతదేశంలో బడ్జెట్ బైక్స్‌తో యువతను ఎంతగానో ఆకట్టుకునే సూపర్ బైక్స్ అమ్మకాలు ఇటీవ కాలంలో భారీగా పెరుగుతున్నాయి. మారుతున్న జీవన ప్రమాణాలకు తగినట్టుగా నలుగురిలో కొత్తదనంతో ఉండాలని కోరుకునే వారు ఈ సూపర్ బైక్స్ కొనుగోలు చేస్తున్నారు.

ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని అన్ని కంపెనీలు సరికొత్త బైక్స్‌ను మార్కెట్‌లో రిలీజ్ చేస్తున్నాయి. ముఖ్యంగా సూపర్ బైక్స్‌కు ఎంతగానో ప్రసిద్ధి చెందిన కవాసకీ ఇటీవల తన న్యూ వెర్షన్ బైక్‌ను భారత మార్కెట్‌లో లాంచ్ చేసింది. కవాసకి నింజా 300 2024 వెర్షన్ సూపర్ లుక్‌తో రిలీజ్ చేసింది. ముఖ్యంగా ఈ బైక్‌లో మునుపెన్నడూ చూడని రంగుల్లో రిలీజ్ చేసి సూపర్ బైక్ ప్రియులను ఆకట్టుకుంటుంది. ఈ బైక్ క్యాండీ లైమ్ గ్రీన్, మెటాలిక్ మూండస్ట్ గ్రే రంగులతో రిలీజ్ చేసిన 2024 వెర్షన్ బైక్ ధర రూ. 3.43 లక్షలు (ఎక్స్-షోరూమ్)కు లాంచ్ చేసింది. ఈ నేపథ్యంలో కవాసకీ నింజా 300 బైక్ గురించి వివరాలను తెలుసుకుందాం. కవాసకి నింజా 300 బైక్ పాత డిజైన్‌తో లాంచ్ చేసిన కొత్త వెర్షన్ కలర్స్ మాత్రం బైక్ లవర్స్‌ను కట్టి పడేస్తున్నా్నీ. ఈ డిజైన్ నింజా 250 స్థానంలో మొదటిసారిగా 2013లో లాంచ్ చేసిన బైక్‌లా ఉంటుంది. అప్పటి నుంచి ఈ బైక్ అంతర్జాతీయ మార్కెట్‌లో నిలిపిసినా భారతదేశంలో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం నింజా 500తో భర్తీ చేసిన నింజా 400తో పాటు అమ్మకానికి ఉంది. కవాసకి నింజా 300 స్పోర్టీ ఔటర్ షెల్ హై-టెన్సైల్ స్టీల్‌తో తయారు చేసిన డైమండ్ ఫ్రేమ్ తో వస్తుంది. కవాసకీ 300ఫ్రేమ్‌కు సపోర్టింగ్ ఫ్రంట్ ఎండ్లో 37 మిమీ టెలిస్కోపిక్ ఫోర్క్‌తో వస్తుంది. వెనుక భాగంలో 5 వే ప్రీలోడ్ అడ్జస్టబుల్ మోనోషాక్ ఉంది. బ్రేకింగ్ డ్యూయల్ పిస్టన్ కాలిపర్తో ఒకే 290 మిమీ డిస్క్ బ్రేక్‌తో వస్తుంది. వెనుక భాగంలో డ్యూయల్-పిస్టన్ కాలిపర్లతో ఒకే 220 మిమీ డిస్క్ బ్రేక్ ఉంటుంది. కవాసకి నింజా 300 296 సీసీ , సమాంతర -ట్విన్ లిక్విడ్-కూల్డ్ ఇంజిన్‌తో వస్తుంది. ఈ బైక్ 38.88 బీహెచ్‌పీ శక్తిని, 26.1 ఎన్ఎం గరిష్ట టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ పవర్ యూనిట్ ఆరు-స్పీడ్ గేర్ బాక్స్ అసిస్ట్, స్లిప్పర్ క్లచ్‌తో వస్తుంది. ఈ నేపథ్యంలో ఈ బైక్ కేటీఎం ఆర్‌సీ 390, యమహా ఆర్3, టీవీఎస్ అపాచీ ఆర్ఆర్ 310, బీఎండబ్ల్యూ జీ 310 ఆర్ వంటి బైక్స్‌కు గట్టి పోటినివ్వనుంది.

# తెలుగు రాష్ట్రాల్లో జియో ప్రభంజనం...




దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో తెలుగు రాష్ట్రాల్లో ప్రభంజనం సృష్టిస్తోంది. రోజురోజుకీ సరికొత్త కస్టమర్లతో జియో దూసుకుపోతోంది. వినియోగదారులను ఆకట్టుకోవడంలో జియోనెట్ వర్క్ దూసుకుపోతోంది.

ట్రాయ్ విడుదల చేసిన తాజా టెలికాం చందాదారుల గణాంకాల ప్రకారం, రిలయన్స్ జియోలో ఈ ఏడాది ఏప్రిల్ నెలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి 1.56 లక్షలకు పైగా కస్టమర్లు కొత్తగా వచ్చి చేరారు.ట్రాయ్ గణాంకాల ప్రకారం ఏప్రిల్ నెలలో జియో అత్యధికంగా 1,56,296 మంది మొబైల్ చందాదారులను చేర్చుకుంది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో జియో కస్టమర్ల సంఖ్య ఏప్రిల్ నెలాఖరి నాటికి 3.29 కోట్లకు చేరుకుంది. ఇదే నెలలో ఎయిర్టెల్ లో 55 వేల మంది కొత్త మొబైల్ చందాదారులు చేరారు. మరోవైపు ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ లో భారీగా 2.57 లక్షల మంది కస్టమర్లను కోల్పోయింది. వోడాఐడియా కూడా 23,456 మంది కస్టమర్లను కోల్పోయింది. ఏప్రిల్ నెలలో దేశవ్యాప్తంగా కూడా జియో తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. జియో లో 26.8 లక్షల మంది కొత్త చందాదారులు చేరారు.

ఈ గణాంకాల ప్రకారం ఏప్రిల్ 2024 నాటికి దేశంలో మొత్తం జియో మొబైల్ కస్టమర్ల సంఖ్య 47.24 కోట్లకు చేరుకుంది. 7.52 లక్షల కొత్త కస్టమర్లు, 26.75 కోట్ల మొత్తం కస్టమర్లతో ఎయిర్టెల్ తర్వాత స్థానంలో ఉంది. దేశీయంగా మొత్తం టెలికాం యూజర్ల సంఖ్య ఏప్రిల్ నాటికి 120 కోట్లు దాటడం విశేషం.

# పల్సర్ బైక్ లవర్స్‌కు గుడ్ న్యూస్..



భారతదేశంలో బజాజ్ కంపెనీకు చెందిన పల్సర్ బైక్స్ ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఉంది. చాలా ఏళ్లుగా పల్సర్ బైక్స్ యువతను ఆకట్టుకుంటున్నాయి.

తాజాగా బజాజ్ ఆటో ఇటీవల భారత మార్కెట్‌లో విక్రయిస్తున్న పల్సర్ మోడల్ లైనపు నవీకరించే పనిలో ఉంది. ఈ ప్రక్రియలో భాగంగా భారతీయ వినియోగదారుల కోసం పల్సర్ 125, 150, 220 ఎఫ్ మోడల్స్ సంబంధించిన అప్‌డేటెడ్ వెర్షన్లను రిలీజ్ చేసింది. ముఖ్యంగా బ్లూటూత్ కనెక్టివిటీతో పాటు అనేక అత్యాధునిక ఫీచర్లతో ఈ బైక్స్ లాంచ్ చేసింది. ముఖ్యంగా అప్‌డేటెడ్ బైక్స్ విజువల్ అప్పీల్‌ను గణనీయంగా పెంచుతున్నాయి. అంతే కాకుండా బజాజ్ పల్సర్ ఎన్ 160ను వీటితో పాటు రిలీజ్ చేసింది. ఈ బైక్‌ను రూ. 1.39 లక్షలకు (ఎక్స్-షోరూమ్) భారతదేశంలో లాంచ్ చేసింది. ఈ నేపథ్యంలో పల్సర్ నయా వెర్షన్ బైక్స్ గురించి వివరాలను తెలుసుకుందాం. పల్సర్ 125 యొక్క కార్బన్ ఫైబర్ సింగిల్, సిట్ సీట్ వేరియంట్లు బ్లూటూత్ కనెక్టివిటీకి మద్దతిచ్చే పూర్తి డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, యూఎస్‌బీ ఛార్జర్‌తో అప్‌డేట్ చేశారు. అలాగే పల్సర్ 150 వేరియంట్లలో ఇలాంటి మార్పులను చేశారు.

# రికార్డు సృష్టించిన పాకిస్థాన్ స్టాక్ మార్కెట్..?




భారత షేర్లు పతనమవుతున్నప్పటికీ.. గత ఐదు రోజులుగా పాకిస్థాన్ స్టాక్ మార్కెట్‌లో కాసుల వర్షం కురుస్తోంది. కరాచీ స్టాక్ ఎక్స్ఛేంజ్ సుమారు ఐదు రోజుల్లో 10 శాతం కంటే ఎక్కువ పెరుగుదలను చూస్తోంది.దీంతో కేఎస్ఈ తొలిసారిగా 80 వేల మార్కులను దాటింది. పెట్టుబడిదారులు పాకిస్తాన్‌లో ఆర్థిక పునరుద్ధరణ సంకేతాలను చూస్తున్నారు. దేశం ఆర్థిక లోటు తగ్గుతోంది. 2025 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేటీకరణకు సంబంధించి ప్రభుత్వం పెద్ద నిర్ణయాలు తీసుకోవచ్చు. కరాచీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో డబ్బు ఎలా కురుస్తుందో గణాంకాల భాషలో అర్థం చేసుకుందాం. పాకిస్థాన్ స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీ కరాచీ స్టాక్ ఎక్స్ఛేంజ్ రికార్డు స్థాయిలో ట్రేడవుతోంది. ట్రేడింగ్ సెషన్‌లో కేఎస్ఈ మొదటిసారిగా 80 వేల పాయింట్ల స్థాయిని దాటింది. 80,059.87 పాయింట్లకు చేరుకుంది. అంతకు ముందు రోజు 78,801.53 పాయింట్ల వద్ద ముగిసింది. అయితే శుక్రవారం కేఎస్ఈ 79,664.65 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రస్తుతం కేఎస్ఈ 441 పాయింట్ల లాభంతో 79,243.03 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. కరాచీ స్టాక్ ఎక్స్ఛేంజ్లో పెరుగుదల రాబోయే రోజుల్లో కొనసాగవచ్చు. గత 5 ట్రేడింగ్ సెషన్లలో కరాచీ స్టాక్ ఎక్స్ఛేంజ్ పెట్టుబడిదారులకు 10 శాతం కంటే ఎక్కువ రాబడిని ఇచ్చింది. జూన్ 11 న కేఎస్ఈ 72,589.49 పాయింట్ల వద్ద ముగిసింది. ఈరోజు కేఎస్ఈ 80,059.87 పాయింట్లతో రికార్డు స్థాయికి చేరుకుంది. అంటే ఈ కాలంలో కేఎస్ఈలో 7,470.38 పాయింట్లు పెరిగాయి. అంటే కేఎస్ఈ ఇన్వెస్టర్లకు 10.29 శాతం రాబడిని ఇచ్చింది. 2025 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేటీకరణకు సంబంధించి ప్రభుత్వం పెద్ద నిర్ణయాలు తీసుకోవచ్చు.

# గులాబీ ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటీ



**హైదరాబాద్, జూన్ :** భారత రాష్ట్ర సమితిలో అంతర్గతంగా అలజడి రేగుతోంది. ఊహించని విధంగా మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో బీఆర్ఎస్ పడిపోయింది. ఆయన ఇంటి ముందు ధర్నా చేసేందుకు బాల్క సుమన్ నేతృత్వంలో కొంత మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రయత్నించారు. కానీ ఈ సమావేశం జరుగుతున్న సమయంలోనే.. ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ... కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డిని కలిశారు. దీంతో.. పార్టీ నుంచి వలసలు చాలా పెద్ద స్థాయిలో ఉంటాయన్న అభిప్రాయం కలుగుతోంది. పార్టీ ముఖ్య నేతలంతా ఇతర పార్టీల్లోకి క్యూ కడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లలో డిపాజిట్లు కూడా కోల్పోవడంతో చాలా మంది నేతలు రాజకీయ భవిష్యత్ పై ఆందోళన చెందుతున్నారు. అదే సమయంలో కాంగ్రెస్, బీజేపీల నుంచి వారిపై ఒత్తిడి వస్తోంది.ప్రస్తుతం 35 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో ఉన్నారు. వీరిలో కనీసం ఇరవై మందిని పార్టీలో చేర్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. మిగతా వారిపై బీజేపీ వల విసురుతోంది. పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై ఈడీ దాడులు రాజకీయమేనని అనుకుంటున్నారు. ఎమ్మెల్యేలను బుజ్జగించేందుకు బీఆర్ఎస్ హైకమాండ్ ప్రయత్నాలు చేస్తోంది. కొద్ది రోజుల కిందట నలుగురు ఎమ్మెల్యేలను కేసీఆర్ ఫామ్ హౌస్‌కు పిలిపించుకుని మాట్లాడారు. కానీ వారెవరూ పార్టీలో ఉండే అవకాశాలు కనిపించడం లేదు.పార్టీ మారుతారని భావిస్తున్న మరికొంత మంది ఎమ్మెల్యేలతోనూ కేసీఆర్ మాట్లాడుతున్నారు. అయితే చాలా మంది స్పందించడం లేదు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి సహా చాలా మంది ఇప్పటికే కాంగ్రెస్ లో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని అంటున్నారు.పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి అసెంబ్లీ సమావేశం కాబోతోంది. అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవ్వాలని అనుకుంటున్నారు. అంతకు ముందే ఆయనకు ప్రతిపక్ష నేత హోదా పోయేలా చేయాలని కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ప్రయత్నిస్తోందని చెబుతున్నారు. . బీజేపీ కూడా ఎమ్మెల్యేలను ఆకర్షించి ప్రధాన ప్రతిపక్షంగా తామే వ్యవహరించాలని బీజేపీ అనుకుంటోందని అంటున్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఇప్పటికే చర్చలు పూర్తి చేసినట్లుగా చెబుతున్నారు.ఎమ్మెల్యేలు కాకుండా ఇతర పార్టీ ముఖ్య నేతలు కూడా వలస బాటలో ఉండటం బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టేదే. ఈ సంక్షోభాన్ని కేసీఆర్ ఆపగలుగుతారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.అసెంబ్లీ ఎన్నికల వరకూ బలంగా ఉన్న బీఆర్ఎస్..ఆ ఎన్నికల్లో ఓడిపోవడంతో పరిస్థితి ఒక్క సారిగా తిరగబడింది. ఇతర రాష్ట్రాల్లో పార్టీని బలోపేతం చేయడానికి ప్రణాళికలు వేసుకుంటే.. ఒక్క ఓటమితో సొంత రాష్ట్రంల ?పార్టీ నేతల్ని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న ఆందోళన బీఆర్ఎస్ నేతల్లో వ్యక్తమవుతోంది. పోచారం అసంతృప్తికి కారణం అదేనా మాజీ స్పీకర్, బీఆర్ఎస్ నేత పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆయన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పోచారంతో పాటు ఆయన కుమారుడు భాస్కర్ రెడ్డికి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ లో కీలకంగా వ్యవహరించిన నేత కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పార్టీ శ్రేణులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. అసలు పోచారం పార్టీని వీడేందుకు గల కారణాలపై పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చలు జరుగుతున్నాయి. అయితే కొంత కాలంగా బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర అసంతృప్తితో ఉన్న పోచారం పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు.బీఆర్ఎస్ ఓడిపోయిన తర్వాత జరిపిన సమీక్షా సమావేశాలలో ఆయన మాట్లాడుతూ పార్టీలో సంస్థాగత మార్పులు తీసుకొని రావాలని, పార్టీని పూర్తిగా ప్రక్షాళన చేయాలని సలహా ఇచ్చారు. పార్టీ అధిష్టానం ఆయన మాటలను పెడచెవిన పెట్టడమే ఈ అసంతృప్తికి కారణంగా తెలుస్తోంది. ఇలానే వ్యవహరిస్తే పార్టీ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందనే భావనలో పోచారం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అసంతృప్తితోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని పోచారం సన్నిహితవర్గాలు అనుకుంటున్నాయి. అయితే ఇప్పటికే పోచారం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు చర్చలు ముగిశాయని, దానికి ఆయన కూడా సుముఖత వ్యక్తం చేయడంతోనే ఈ భేటీ జరిగిందని పార్టీ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి.

# నాలుగో ఎమ్మెల్యే

**హైదరాబాద్, జూన్ :** తెలంగాణలో ఆపరేషన్ ఆకర్ష్ జోరుగా కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు కారులో ఉక్కపోత తట్టుకోలేక హస్తం గూటికి చేరుకుంటున్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో మొదలైన ఈ పర్వం తాజాగా మాజీ స్పీకర్ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో మరోసారి ఈ అంశం తెరవీదకు వచ్చింది.పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్ బీ ఫామ్‌పై గెలిచిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర ఈ ఉదయం చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. 20 మంది ఎమ్మెల్యేలు కారు దిగి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. దీంతో ఎవరెవరు హస్తం గూటికి చేరుకుంటారనే చర్చ మొదలైంది.ఇదిలా ఉండగా ఈ ఉదయం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డిని కలవడం చర్చకు దారితీసింది. కాంగ్రెస్ పార్టీ అన్ని వైపుల నుంచి ఆపరేషన్ ఆకర్ష్ ప్రారంభించిందనే వాదనలు వినిపిస్తున్నాయి. త్వరలో లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే చర్చ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.బీఆర్ఎస్ పార్టీ మాత్రం ఈ వాదనలను కొట్టిపారేసింది. జానారెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడానికి లక్ష్మారెడ్డి వెళ్లారని పార్టీ శ్రేణులు తెలిపాయి. పోచారం వంటి సీనియర్ నేతలే కారు దిగిపోతుండటంతో ఉప్పల్ ఎమ్మెల్యే కాంగ్రెస్ గూటికి చేరడంలో



ఆశ్చర్యం లేదని మరికొందరి వాదన.ఎలా ఉన్నా బీఆర్ఎస్ పార్టీని ఖాళీ చేసి కారును షెడ్డుకు తరలించాలనే కాంగ్రెస్ పార్టీ కంకణం కట్టుకున్నట్లు తెలుస్తోంది. అందుకు సంబంధించి వారు వేస్తోన్న అడుగులు ఈ వాదనలకు బలం చేకూర్చుతుంది. కేసీఆర్, కేటీఆర్ అహంకారమే ఆ పార్టీకి శాపంగా మారిందని మరికొందరి వాదన.ఉప్పల్ ఎమ్మెల్యే బాటలోనే గద్వాల ఎమ్మెల్యే బండ కృష్ణమోహన్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌లు నడుస్తున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఇదే జరిగితే చివరికి కేటీఆర్, కేసీఆర్ మాత్రమే ఆ పార్టీలో ఉంటారనే వాదన కూడా వినిపిస్తోంది.

# బ్రాండ్లపై ధరల బాంబు




**వరంగల్, జూన్ :** తెలంగాణ ప్రభుత్వం మందుబాబులకు షాక్ ఇవ్వనుందా..? మద్యం ధరలను పెంచేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తోందా అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. ఓ పక్క రాష్ట్రంలో కావాల్సిన బ్రాండ్ల మద్యం, బీర్లు దొరకడం లేదని మందుబాబులు ఆందోళన చెందుతుంటే మరో పక్క మద్యం ధరలు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది.సాధారణంగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రాష్ట్రంలో మద్యం ధరలు పెరుగుతూ ఉంటాయి. రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం 2022లో మద్యం ధరలను పెంచింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మద్యం ధరలను పెంచేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం.అన్ని బ్రాండ్ల లిక్కర్ ధరల మీద 20 నుంచి 25 శాతం వరకు ధరలు పెరిగే అవకాశం ఉంది. బీర్ల పైన రూ.10 నుంచి రూ.15 మేరకు పెరగనున్నట్లు తెలుస్తోంది. ధరలను పెంచినట్లయితే.. ఏటా ప్రభుత్వానికి మూడు నుంచి మూడున్నర వేల కోట్ల రూపాయల అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. వాస్తవానికి ఈ ఏడాది మార్చిలోనే ధరలను పెంచాల్సి ఉండగా.. లోక్‌సభ ఎన్నికల కారణంగా వాయిదా పడినట్లు తెలుస్తోంది.ఎక్సైజ్ శాఖ ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.35వేల కోట్ల ఆదాయం వస్తోంది. ఇప్పుడు ధరలను పెంచితే ఏటా దాదాపు రూ.40వేల కోట్ల రూపాయల వరకు ఆదాయం రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వచ్చిన ఆదాయాన్ని సంక్షేమ పథకాలకు వినియోగించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

# రేవంత్, కేటీఆర్ ట్వీట్ వార్


**హైదరాబాద్, జూన్ :** సింగరేణి బొగ్గు గనుల వేలంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుల మధ్య ట్వీట్ వార్ పీక్స్‌కి చేరింది. రేవంత్ రెడ్డి గారూ అంటూ కేటీఆర్ ట్వీట్ ద్వారా ప్రశ్నిస్తే, కేటీఆర్ గారూ అంటూ రిప్లై ఇచ్చారు సీఎం రేవంత్.సింగరేణిలో బొగ్గు గనుల వేలంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలే కాదు.. ట్వీట్ ఫైట్లూ కంటిన్యూ అవుతున్నాయి. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిపై ప్రశ్నల వర్షం కురిపించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. పీసీసీ అధ్యక్షుడిగా 2021లో బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలని, 4 బ్లాక్‌లను సింగరేణికి బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలంటూ నాటి రేవంత్ రెడ్డి చేసిన ట్వీట్‌ను రీట్వీట్ చేశారు కేటీఆర్. అప్పుడు వేలాన్ని వ్యతిరేకించి, ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక వేలం పాట కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను పంపించడం ఏంటని ప్రశ్నించారు. మీలో మార్పుకు గల కారణాలు చెప్పాలని ఎక్స్ వేదికగా నిలదీశారు.కేటీ రామారావు ట్వీట్‌ను రేవంత్ రెడ్డి రీట్వీట్ చేస్తూ పాయింట్ టూ పాయింట్ రిప్లై ఇచ్చారు. తెలంగాణ సంస్థల ప్రైవేటీకరణను, తెలంగాణ ప్రజల వాటాల విక్రయానికి కేంద్రం పూనుకున్నా, కేసీఆర్ ప్రభుత్వం ప్రయత్నించినా, కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు అడుగడుగునా వ్యతిరేకించారని వెల్లడించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే కేంద్రం సింగరేణి గనులను తొలిసారి వేలం వేసిందని, రెండు ప్రైవేటు కంపెనీలకు అప్పగించిందని అన్నారు. అప్పుడే అరబిందో,



అవంతిక కంపెనీలకు కట్టబెట్టిందని చెప్పారు. అప్పుడు బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడలేదు..? అని కేటీఆర్‌ను ప్రశ్నించారు.సింగరేణి గనులను ప్రైవేటీకరించడం, వేలం వేయడాన్ని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అప్పుడే వ్యతిరేకించారని తెలిపారు. అవంతిక, అరబిందో కంపెనీలకు అప్పగించిన బొగ్గు బ్లాకులను రద్దు చేసి తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారని వెల్లడించారు. ఈ మేరకు భట్టి విక్రమార్క రాసిన లేఖను జత చేశారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలు, ఆస్తులు, హక్కులను కాపాడేది కాంగ్రెస్ పార్టీ ఒకటేనన్నారు. తెలంగాణ భవిష్యత్తు కాంగ్రెస్‌తోనే సురక్షితం. మన బొగ్గు.. మన హక్కును కాపాడి తీరుతాం అంటూ ఎక్స్ వేదికగా కేటీఆర్‌కు రిప్లై ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి.

# రీల్స్ కోసం... పిచ్చిపనులు..తాట తీస్తామంటున్న పోలీసులు

**హైదరాబాద్, జూన్:** సోషల్ మీడియా విస్తృతమైనప్పటి నుంచి టీనేజర్స్, యూత్ తో విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఏది చేయాలో.. ఏది చేయద్దో.. స్పృహ ఉండడం లేదు. ఒకడు కరెంటు తీగలు ముట్టుకుంటానంటాడు.. మరొకడు విషపు పాములను ముద్దు పెట్టుకుంటా అంటాడు. ఇంకొకడు బిల్డింగ్ పై నుంచి దూకుతానని అంటాడు. ఇలా ప్రతీ ఒక్కరు ఏదో ఒక పని చేస్తున్నారు. కేవలం 30 సెకండ్ల రీల్స్ కోసం ప్రణాన్ని విలువైన యవ్వనాన్ని పనంగా పెడుతున్నారు.మొన్నటికి మొన్న పుణెలో రీల్ చేసేందుకు అతిపెద్ద భవనం పై నుంచి ఒక లేడీ స్టంట్ చేసింది. దేవుడి దయ వల్ల ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. కానీ ఒక వేళ పైన పట్టుకునే వ్యక్తి చేయి జారి ఉంటే మాత్రం ఇప్పటికి పాడె లేచేది. మరి వీటితో ఏం లాభం అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం లైకుల కోసమే ఇదంతా. దీనితో ఎవరికీ ఏమీ ప్రయోజనం ఉండదు. టీచర్లు, పెద్దలు కొన్ని చదువుకునే వీడియోలు పెడితే బాగుంటుందని సూచిస్తున్నారు. సోషల్ మీడియాను ఇలా వాడుకుంటే పేదలకు సైతం చదువు అందుతుందని చెప్తున్నారు. కానీ యూత్ మాత్రం ఇలాంటి అర్థం పర్థం లేదని పనులు చేస్తూ టైం వేస్ట్ చేస్తుంది.తాజాగా, హైదరాబాద్ నగరం నడిబొడ్డున యూసుఫ్ గూడ ప్రధాన రహదారి వద్ద నడుస్తున్న బస్సు ఎదుటకు బ్లాక్ టీషర్ట్, బ్లాక్ ప్యాంట్ ధరించి ఒక యువకుడు ఒక్కసారిగా వచ్చాడు. పాపం డ్రైవర్ ఏం జరుగుతుందో తెలియక కంగారు పడ్డాడు.



కానీ బస్సు ఆ సమయంలో బ్రేకులు వేయలేకపోయాడు. వెంటనే ఆ యువకుడు బస్సు కింద మధ్యలో పడుకున్నాడు. బస్సు డ్రైవర్ యువకుడికి ఏమీ కావద్దని ఎటు వైపునకు మలుపు తీసుకోకుండా నేరుగా పోనిచ్చాడు. దీంతో సదరు యువకుడికి ఎలాంటి గాయాలు కాలేదు. తాపీగా లేచి వెళ్లిపోయాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో ఇది వైరల్ కాగా.. యువకుడిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని నెటిజన్లు కోరుతున్నారు. ఒకరికి కఠిన శిక్ష వేస్తే ఇలాంటి వారు మారుతారని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. కేవలం లైకుల కోసం చేస్తున్న ఇలాంటి పిచ్చి పనులు విస్మయానికి గురి చేస్తుండగా.. యువతకు కౌన్సెలింగ్ ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

# గ్రేటర్ లో గులాబీల ఎటూ



**హైదరాబాద్, జూన్ :** గ్రేటర్ హైదరాబాద్ పాలక మండలిలో బీఆర్ఎస్ కార్పొరేటర్ల పరిస్థితి ప్రస్తుతం ఏంటన్నది ఆసక్తి రేపుతోంది. ఆ పార్టీ కార్పొరేటర్లు ఇప్పుడు తాము అధికార పక్షమా.. ప్రతిపక్షమా అని తేల్చుకోలేని పరిస్థితి నెలకొంది. గ్రేటర్‌లో రెండోసారి పాగా వేసిన బీఆర్ఎస్‌కు కొత్త చిక్కులు తప్పేలా లేవు. సాంకేతికంగా బీఆర్ఎస్ పార్టీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నా.. మారిన రాజకీయ పరిస్థితులతో ఆ పార్టీ కార్పొరేటర్లు ఎలా వ్యవహరిస్తారన్నది చర్చనీయంశంగా మారింది.2019లో రెండోసారి అధికారం చేపట్టిన గులాబీ పార్టీ.. తిరిగి హైదరాబాద్ మేయర్ పీఠాన్ని తన ఖాతాలో వేసుకుంది. మొదటిసారి భారీ మెజార్టీతో మేయర్ పదవిని తమ ఖాతాలో వేసుకున్నా.. రెండోసారి మాత్రం గ్రేటర్‌లో దాదాపు సగం స్థానాలను కోల్పోయింది. అయినా మెజార్టీ స్థానాలు గెలుచుకొని గ్రేటర్ పీఠంపై గులాబీ జెండా ఎగురవేసింది. మేయర్‌గా సీనియర్ పొలిటీషియన్ కేకే కూతురు గద్వాల విజయలక్ష్మికి పార్టీ అవకాశం కల్పించింది. ఇక డిప్యూటీ మేయర్‌గా మోతే శ్రీలతా రెడ్డిని ఎంపిక చేసింది గులాబీ పార్టీ. అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. అంతా సవ్యంగానే జరిగినా ఆ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. ఫలితాల తర్వాత ప్రభావం గ్రేటర్‌పై భారీగానే పడింది.అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత.. బీఆర్ఎస్‌కు చెందిన మేయర్, డిప్యూటీ మేయర్ కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. వీరితోపాటు మరికొంత మంది కార్పొరేటర్లు కూడా హస్తం గూటికి చేరుకున్నారు. ఎన్నికలకు దాదాపు రెండేళ్ల సమయం ఉండడంతో రాబోయే రోజుల్లో మరికొంతమంది కార్పొరేటర్లు కూడా అధికార పార్టీలో చేరే అవకాశం కనిపిస్తోంది. అటు హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి ఒక ఎమ్మెల్యే స్థానం కూడా దక్కకపోవడంతో.. ఎమ్మెల్యేలను టార్గెట్‌గా చేసి తమ పార్టీలో కలుపుకునేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. దీంతో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు అధికార పార్టీ టచ్‌లోకి వెళ్తే గ్రేటర్ సర్వసభ్య సమావేశాల్లో బీఆర్ఎస్ పాత్ర నామమాత్రంగానే మారిపోయే ఛాన్స్ కనిపిస్తోంది.అయితే ప్రస్తుతం బీఆర్ఎస్‌కు మెజార్టీ సభ్యుల బలం ఉన్నప్పటికి.. పార్టీ మారిన మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం కూడా లేదు. నాలుగేళ్ల వరకు అవిశ్వాసం పెట్టే ఛాన్స్ లేకపోవడంతో మరో ఏడాది బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్రస్తుత మేయర్, డిప్యూటీ మేయర్‌పైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాంకేతికంగా బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్‌లో అధికార పీఠంపై ఉన్నా దాని ప్రభావం అంతంత మాత్రమే ఉండనుంది. ఇక గ్రేటర్‌లో చక్రం తిప్పే ఎంఐఎం పార్టీ అధికార పార్టీతో సమన్వయంగా ముందుకు వెళుతుంది.

# ప్రతిపక్ష స్థానమైనా ఉంటుందా



**హైదరాబాద్, జూన్ :** నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అన్నట్టు తయారైంది కేసీఆర్ పరిస్థితి. అధికారం ఉన్నపుడు ప్రతిపక్షం లేకుండా చేయాలనే ఆయన తపన చివరికి ఆయన్నే మింగేసేలా తయారైంది. 2014 నుంచి ఇతర పార్టీల్లో గెలిచిన వారిని నయానో.. భయానో బీఆర్ఎస్‌లో చేర్చుకుంటూ వచ్చారు. 2018లోపు దాదాపు తెలంగాణలో టీడీపీ లేకుండా చేశారు. ఈ తర్వాత 2023లోపు కాంగ్రెస్ ను కూడా ఖతం చేయాలని చూశారు. దాదాపు ప్రజల్లో కూడా ఆ అభిప్రాయం క్రియేట్ చేయడంలో సక్సెస్ అయ్యారు. అయితే.. రేవంత్ రెడ్డి చేతికి కాంగ్రెస్ పగ్గాలు వచ్చిన తర్వాత సీన్ మారిపోయింది. ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. ప్రజలు ఇచ్చిన ఓటమిని గౌరవించకుండా అవకాశం దొరికిన ప్రతిసారీ.. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది.. మరో 6 నెలల్లో కేసీఆర్ సీఎం అవుతారని చెప్పడం మొదలు పెట్టారు. నిజానికి సీఎం రేవంత్ రెడ్డి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడానికి ఇష్టపడలేదు. కానీ, ప్రభుత్వాన్నే కూల్చేస్తామంటే ఎవరికైనా తప్పదు.అందుకే కాంగ్రెస్ తో కలిసి నడుస్తామని అంటున్నవారిని రేవంత్ రెడ్డికి కలుపుకొని పోతున్నారు. బీఆర్ఎస్ 40 మంది ఎమ్మెల్యేలను గెలుచుకుంటే.. పార్లమెంట్ ఎన్నికల ముందు ఐదుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరారు. ఇప్పుడు మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ కూడా హస్తం కండువా కప్పుకున్నారు. పార్టీ ఓడిపోయిన తర్వాత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రమాణ స్వీకారానికి మినహా అసెంబ్లీకి వచ్చింది లేదు. అయితే, ఇకపై వస్తానని ఆయన ప్రకటన చేశారు. కేసీఆర్ అసెంబ్లీలో అడుగు పెట్టేసరికి ఆయనకు ప్రతిపక్షహోదా కూడా దక్కేలా కనిపించడం లేదు. ఇప్పటికే కాంగ్రెస్ తో 20 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. మిగిలిన వారికి బీజేపీ గాలం వేస్తుందని తెలుస్తోంది. ప్రధాన ప్రతిపక్షంగా తామే ఉండాలని బీజేపీ గట్టిగా ప్రయత్నిస్తోంది. ఏది ఏమైనా రోజులు లేదంటే కొన్ని నెలల్లో అసెంబ్లీలో బీజేపీ కంటే బీఆర్ఎస్ తక్కువ సంఖ్యా బలానికి పడిపోతుందని గులాబీ నేతలే చెబుతున్నారు.పార్లమెంట్ ఎన్నికల్లో చాలా స్థానాల్లో డిపాజిట్లు కూడా రాకపోవడంతో ఇక బీఆర్ఎస్ కు భవిష్యత్ లేదని ఫిక్స్ అయ్యారట. అందుకే ఎవరి దారి వారు చూసుకుంటున్నారని తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోవడం ఒక ఎత్తు అయితే.. ఓటమికి బీఆర్ఎస్ అధినేతే కారణమని ఆ పార్టీ నేతలు అంటున్నారు. కాంగ్రెస్ మీద కోపంతో బీజేపీకి ఆయనే స్వయంగా ఓటు బ్యాంక్ సిఫ్ట్ చేశారనే వాళ్లు కూడా ఉన్నారు. దీంతో.. పార్టీకి భవిష్యత్ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే మెజారిటీ ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డితో మంతనాలు మంతనాలు జరుపుతున్నారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com